www.visalaandhra.com

స్థాపితం : 1952



విశాలాంధ్ర

70 ANNIVERSARY

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

బుధవారం 22-06-2022 | విజయవాడ ప్రచురణ | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 71, సంచిక : 01 పేజీలు : 8, వెల: రూ.5.00

రాష్ట్రపతి అభ్యర్థులు వీరే...

ఎన్డీయే

రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి అధికార, విపక్షాల అభ్యర్థులపై ఉత్కంఠకు తెరపడింది. ఎన్‌డీఏ, విపక్షాలు మంగళవారం వేర్వేరుగా సమావేశమై అభ్యర్థుల పేర్లను ఖరారు చేశాయి. ఎన్‌డీఏ అభ్యర్థిగా ఒడిశాకు చెందిన ద్రౌపది ముర్మును ఖరారు చేసినట్లు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. సీనియర్ నేత యశ్వంత్‌సిన్హా పేరును విపక్షాలు ఖరారు చేశాయి. ప్రతిపక్షాలన్నీ ఏకాభిప్రాయంతో సిన్హా పేరుకు మద్దతు తెలిపాయి.

2లో

విపక్షం



వంద శాతం ముప్పు

- అగ్నిపథ్‌ను వెనక్కి తీసుకోవాల్సిందే
- నాలుగేళ్ల తర్వాత వీధి విక్రయదారులుగా సైనికులు
- యువత ఉద్యమానికి సంపూర్ణ మద్దతు
- సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం
- యువత ఉద్యమానికి సంఘీభావంగా వామపక్షాల రాష్ట్ర సదస్సు

2లో

ప్రసంగిస్తున్న వినయ్ విశ్వం, వేదికపై రామకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, దోనేపూడి శంకర్, పోలారి తదితరులు

మహా సంక్షోభం

- 15 మంది ఎమ్మెల్యేలతో సూరత్‌కు మకాం
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఉద్ధవ్ అత్యవసర భేటీ
- సంకీర్ణ ప్రభుత్వానికి ఢోకా లేదు: ఎన్‌సీపీ, కాంగ్రెస్
- మాది నమ్మకస్తుల పార్టీ.. అందరూ తిరిగొస్తారు: శివసేన
- ప్రభుత్వ ఏర్పాటునకు ఏక్‌నాథ్ ప్రతిపాదిస్తే పరిగణిస్తాం: బీజేపీ

శివసేనలో చీలిక

మంత్రి షిండే తిరుగుబాటు

2లో

అగ్నిపథ్ రద్దుకు నారాయణ నిరసన దీక్ష

2లో

సూడాన్‌లో ఆహార కొరత తీవ్రం

2లో

రాహుల్‌పై ఈడీ ప్రశ్నల వర్షం!

2లో

Dr. T. Seva Kumar M.B.B.S., Founder & Chairman Since : 1996

ఆధునిక ఆరోగ్య పరీక్షలు, వైద్యం, మందులు - కారాదు ఎవరికీ ఆర్థిక భారం

సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (S.H.O.)

H.O : 2/1, బ్రాడీపేట, గుంటూరు-2. ఫోన్ : 0863-2242995, సెల్ : 98483 91212

B.O : ధర్మ భవన్, రామిరెడ్డితోట, 2వ లైను, ఓల్డ్‌క్లబ్ రోడ్, కొత్తపేట, గుంటూరు-1. సెల్ : 9063505111

web : www.servicehealth.org, E-mail : sevasho@gmail.com

మెడ్‌సిస్ ప్యాథ్ ల్యాబ్స్ CAP & ISO - Certified, NABL - Accrediated (Corona Tests Permitted by Govt of Telangana) హైదరాబాద్ సహకారంతో....

Complete Health Checkup - Total -86 Tests. Rs. ~~5630/-~~ 73% off Rs. 1500/- Only

01. Lipid Profile (7)
02. Liver Profile (11)
03. Diabetic Screen (3)
04. E.C.G., B.P. Checkup
05. Fasting Blood Sugar (1)
06. Complete Hemogram (17)
07. Complete Urinogram (16)
08. B.M.I., W/h Ratio
09. Thyroid profile (5)
10. Kidney Profile (10)
11. Vitamin - D
12. Vitamin - B12
13. Folic Acid,
14. EGFR
15. HbA1c (2)
16. Iron Profile (4)

మొత్తం 86 పరీక్షల కంప్లీట్ హెల్త్ చెకప్ Now Rs.1500/- only ఉచిత వైద్య సలహాలు

COMPLETE HEALTH CHECKUP

★ S.H.O. ఉచిత క్లినిక్
★ హైపర్ టెన్షన్ & డయాబెటిక్ క్లీనిక్

ShoAP tv We Educate

ఆహార, వైద్య, ఆరోగ్య పర వీడియోలను వీక్షించండి - SHOAP-TV YouTube SUBSCRIBE

అతి తక్కువ ధరలకే ... 40-80% తగ్గింపుతో ప్రముఖ కంపెనీల అన్ని రకముల జనరిక్, బ్రాండెడ్ మందులు లభించును.

S.H.O.జనరిక్ ఫార్మశి | ధర్మ జనరిక్ ఫార్మశి

S.H.O. ప్యూర్ ఫుడ్స్ 2/1, బ్రాడీపేట, గుంటూరు, ఫోన్ : 0863-2242995

స్వచ్ఛమైన తాటిబెల్లం, ఆర్గానిక్ పసుపు, ఆర్గానిక్ కారం, స్వచ్ఛమైన గానుగ నూనెలు, అన్ని రకముల చిరుధాన్యములు ముడి బియ్యం, పిండి, రవ్వలు, డయాబెటిక్ రైస్ లభించును.

రండి.. దర్శించండి.. తరించండి...

విశాలాంధ్ర 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అవధూతల్లో ఆణిముత్యం... స్మరించినంతనే కోర్కెలు తీర్చే తల్లి

శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానము

అడిగొప్పల గ్రామము, దుర్గి మండలం, పల్నాడు జిల్లా

అమ్మవారి సన్నిధి

దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీయుత వాణిమోహన్, ఆ శాఖ ముఖ్య ప్రత్యేక కమీషనర్ శ్రీయుత హరిజవహర్‌లాల్ ఆదేశాల మేరకు శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానము అభివృద్ధికి దాతలు భక్తులు ఈ-హుండీ ఎకౌంట్లో విరాళములు, కానుకలు సమర్పించుటకు, భక్తులు ఇంటి నుండే పరోక్షసేవలు పొందుటకు నూతనంగా సౌకర్యం కల్పించారు.

1. ఈ-హుండీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెం 202412010000025, IFSC Code : UBIN0820245, మాచర్ల బ్రాంచ్‌కు నగదు జమ చేయగలరు
2. ఆన్‌లైన్‌లో tms.ap.gov.in వెబ్‌సైట్‌లో వెళ్ళి పరోక్ష సేవల కొరకు HDFC బ్యాంక్ అకౌంట్ నెం. 50100429380460 IFSC Code: HDFC0002259 మాచర్ల బ్యాంక్‌కు (అష్టోత్తరం, పంచామృత, గోపూజ రూ. 25/- చండీ హోమము రూ. 500/-)టికెట్ రుసుములు పంపగలరు.
3. విరాళములు పంపిన వారు గోత్రనామాలు దేవస్థానము వాట్సప్ నెంబరు 9390855670కు పంపినచో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా పొందాలని ఆశిస్తున్నాం

అమ్మవారి సేవలో... నరసింహబాబు శ్రీ గిరిరాజు కార్యనిర్వహణాధికారి

విశాలాంధ్ర 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



పిన్నెల్లి వెంకట రామిరెడ్డి
వైయస్ఆర్ సిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
వైయస్ఆర్ సిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, పల్నాడు జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్, ప్రభుత్వవిప్, మాచర్ల శాసనసభ్యులు

విశాలాంధ్ర కు 70వ వార్షికోత్సవం శుభసందర్భంగా యాజమాన్యానికి, పాత్రికేయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

రెంటచింతల మండల రేషన్ డీలర్ల అసోసియేషన్

కొలంబియాలో పెట్రో విజయోత్సవాలు

కారకస్ : కొలంబియా అధ్యక్ష ఎన్నికలలో వామపక్ష నేత గుస్తావో పెట్రో విజయోత్సవాన్ని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ఘనంగా జరుపుకున్నారు. కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలలో చారిత్రాత్మక విజయం సాధించినందుకు గుస్తావో పెట్రో, ఫ్రాన్సియా మార్క్వెజ్‌లను అభినందిస్తున్నాను. ప్రజల అభీష్టం వినబడింది. కొలంబియన్లు ప్రజాస్వామ్యం, శాంతి మార్గాన్ని కోరుకుంటున్నారని మదురో ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పెట్రో గెరిల్లా ఉద్యమ నేత అయన రెండుసార్లు అధ్యక్ష పదవికి పోటీ చేసాడు, కొలంబియాను ఆధిపత్య సంప్రదాయవాద రాజకీయాల నుండి విముక్తి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. వెనిజులా ప్రభుత్వం వెంటనే బొగోటాతో దౌత్య సంబంధాలను పునఃస్థాపించాలనే కోరికను వ్యక్తం చేసింది. దౌత్య సంబంధాల పునరుద్ధరణ కొలంబియాలో నివసిస్తున్న మిలియన్ల కొద్దీ వెనిజులా ప్రజలకు , వెనిజులాలోని మిలియన్ల కొద్దీ కొలంబియన్లకు భౌతిక ప్రయోజనాలను కలుగజేస్తుందని మదురో పేర్కొన్నారు. 2,200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకోవడంతో పాటు, రెండు దేశాలకు సుదీర్ఘమైన భాగస్వామ్య చరిత్ర ఉంది. ఆదివారం నాటి ఫలితాలు లాటిన్ అమెరికా దేశాల్లో వామపక్ష ధోరణికి మరో ఉదాహరణగా నిలిచాయి. బ్రెజిల్‌లో మాజీ అధ్యక్షుడు లులా డా సిల్వా ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికలలో తిరిగి అధికారంలోకి రావచ్చని అంచనా. మెక్సికోకు చెందిన

లోపెజ్ ఒబ్రాడోర్, చిలీకి చెందిన గాబ్రియేల్ బోరిక్, పెరూకు చెందిన పెడ్రో కాస్టిల్లో, బొలీవియాకు చెందిన లుచో ఆర్స్ వంటి వామపక్ష నాయకులు, ఇతర ప్రాంతీయ నాయకులు పెట్రో విజయాన్ని సంబరాలు చేసుకుంటూ సందేశాలు పంపారు.

సూడాన్‌లో ఆహార కొరత తీవ్రం

ఐక్యరాజ్యసమితి : గత నెలల్లో ఘర్షణలు, వాతావరణ ప్రతికూల పరిణామాల ఫలితంగా దక్షిణ సూడాన్‌లో ప్రజల పరిస్థితి క్షీణించిందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వెలిబుచ్చింది. సూడాన్‌లో తీవ్ర ఆహార అభద్రత ఈ సంవత్సరం కొనసాగుతుంది. మే నుంచి జూలై వరకు లీన్ సీజన్‌లో సుమారు 8.3 మిలియన్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను అనుభవించారు. దాదాపు 2.9 మిలియన్ల మంది ప్రజలు అత్యవసర స్థాయి ఆకలిని ఎదుర్కొంటారని, 87,000 మంది ప్రజలు విపత్తు స్థాయి ఆహార అభద్రతను ఎదుర్కొంటారని యుఎన్ భద్రతా మండలికి వెల్లడించింది. దక్షిణ సూడాన్ ఇప్పుడు నాల్గవ సంవత్సరం సగటు కంటే ఎక్కువ వర్షపాతాన్ని ఎదుర్కొంటోంది, ఇది వ్యవసాయ సీజన్‌కు అంతరాయం కలిగించగా ఆహార ఉత్పత్తిని అడ్డుకుంది. యూనిటీ స్టేట్‌లో ఇప్పటికే 200,000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని, గత సంవత్సరం వరదల నుండి నీటితో నిండిన ప్రాంతాలలో కొత్త వరదలు సంభవించాయని, ఈ సంవత్సరం వరదల వల్ల కనీసం అర మిలియన్ల మంది ప్రజలు ప్రభావితమవుతారని ఆమె చెప్పారు. 2 మిలియన్లకు పైగా ప్రజలు అంతర్గతంగా స్థానభ్రంశం చెందారు. 2.3 మిలియన్లకు పైగా దక్షిణ సూడానీస్ శరణార్థులుగా ఉన్నారు. జాతీయ హింస, పశువులను పోషించుకోలేక ప్రజలు స్థానభ్రంశం కొనసాగుతోంది. మహిళలు, బాలికలు లింగ ఆధారిత హింసకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

మాక్రాన్‌కు షాక్

పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడిగా రెండోసారి పదవిచేపట్టిన ఇమ్మానుయేల్ మాక్రాన్‌కు పార్లమెంటరీ ఎన్నికల్లో ఆ దేశ ఓటర్లు భారీ షాక్ ఇచ్చారు. సోమవారం విడుదలైన ఫలితాలతో ఆయన పార్టీ కూటమి పార్లమెంట్‌లో మెజార్టీ కోల్పోయింది. 577 స్థానాలు గల పార్లమెంట్‌లో 289 స్పష్టమైన మెజార్టీ కాగా, మాక్రాన్‌కి చెందిన మధ్యేవాద కూటమి 245 స్థానాల్లో గెలుపొందింది. ఇక, జీన్‌లూక్ మెలెన్‌చోన్ నేతృత్వంలోని కొత్త వామపక్ష కూటమి న్యూ పాపులర్ ఎన్విరాన్‌మెంటలిస్ట్ అండ్ సోషల్ యూనియన్ (ఎన్‌యూపీఈఎస్) 131 స్థానాల్లో విజయం సాధించి రెండో స్థానంలో నిలిచింది. మితవాద నేషనల్ ర్యాలీ పార్టీకి 89 స్థానాలు దక్కాయి. తాజా ఫలితాలు ఫ్రెంచ్ రాజకీయాలను గందరగోళంలో పడేశాయి.

అగ్నిపథ్ రద్దుకు నారాయణ నిరసన దీక్ష

విశాలాంధ్ర- తిరుపతి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దేశ భద్రతకు హాని కలిగించే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ డిమాండ్ చేశారు. అగ్నిపథ్ ను రద్దు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం నారాయణ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రతకు ఉపయోగపడే రక్షణ రంగాన్ని బలహీనపరచడానికి ఈ పథకాన్ని తీసుకు వచ్చారని విమర్శించారు. లక్షల మంది యువత దేశ రక్షణ కోసం పని చేయాలని ప్రతిరోజు సాధన చేస్తూ, కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు పెట్టికొని చదువుతూ ఉన్నారని చెప్పారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం వల్ల చదువుకున్న యువతకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం వల్ల దేశ భవిష్యత్తుకు హాని జరుగుతుందని నొక్కి వక్కాణించారు. దేశ రక్షణ వ్యవస్థను కొంత మంది ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందని ఘాటుగా విమర్శించారు. దేశవ్యాప్తంగా పోరాటం చేసిన యువతపై కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి. మురళి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, సీపీఐ నాయకులు కె రాధాకృష్ణ, కుమార్ రెడ్డి, నదియా తదితరులు దీక్షలో పాల్గొన్నారు. నారాయణ చేపట్టిన దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాగంటి గోపాల్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య తదితరులు నారాయణ దీక్షకు మద్దతు తెలిపారు.

'మహా' సంక్షోభం

ముంబై/సూరత్: మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. శివసేనలో చీలిక ఏర్పడింది. ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేపై శివసేన నేత, మంత్రి ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేశారు. ఏకంగా 15 మంది ఎమ్మెల్యేలతో గుజరాత్‌కు మకాం మార్చారు. దీంతో మహా వికాస్ అగాఢీ (ఎంవీయే) సంకీర్ణ ప్రభుత్వం కష్టాల్లో పడింది. ఠాక్రే ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్న తిరుగుబాటు వర్గం ప్రభుత్వ ఏర్పాటుపై బీజేపీతో మంతనాలు సాగిస్తోంది. తాజా పరిణామాలతో తమకు సంబంధం లేదని, ప్రభుత్వం ఏర్పాటుపై షిండే తమను సంప్రదిస్తే పరిగణనలోకి తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పాటిల్ అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు జరుగుతున్న మూడో ప్రయత్నం ఇదని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ఇది శివసేన అంతర్గత వ్యవహారమని, దీనిని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే చూసుకుంటారని ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన పవార్ తెలిపారు. మహారాష్ట్ర శాసనమండలి ఎన్నికల్లో ఏక్‌నాథ్ వర్గం బీజేపీకి అనుకూలంగా ఓటు వేయడం సంక్షోభానికి కారణంగా తెలుస్తోంది. అప్పటి నుంచి ఎమ్మెల్యేలతో కలిసి ఏక్‌నాథ్ సూరత్‌లో మకాం పెట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివసేన అధినేత, సీఎం ఉద్ధవ్ ఠాక్రే అత్యవసరం సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు సునీల్ కదం, దాదా భూసే, నీలం గోర్హేలతో పాటు ఎంపీలు అరవింద్ సావంత్, వినాయక్ రౌత్, ఎమ్మెల్సీ మనీషా కయాండె తదితరులు హాజరయ్యారు. షిండే వెంట 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. శివసేన నిజాయతీపరుల పార్టీ అని నొక్కిచెప్పారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ తరహాలో మహారాష్ట్రలోనూ తమ పభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ చేసే ప్రయత్నాలు ఫలించవన్నారు. షిండే నమ్మకస్తుడని, ఎమ్మెల్యేలంతా తిరిగి వచ్చేస్తారని, వారందరితో సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి చగన్ భుజ్‌బల్ మాట్లాడుతూ తమ పార్టీ ఎమ్మెల్యేలంతా ఐక్యంగా ఉన్నారన్నారు. ఎంవీయే ప్రభుత్వానికి ఢోకా లేదని కాంగ్రెస్ నేత నానా పటోలే అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరగడాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. దేశంలో కొనసాగుతున్న బీజేపీ మార్కు రాజకీయాల్లో ఇది భాగమని అన్నారు. బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని అందరికీ తెలుసన్నారు. ధనబలం, అబద్ధాల పునాదిపై నిలబడిందని విమర్శించారు. చివరికి నిజమే గెలుస్తుందని నొక్కిచెప్పారు. అసెంబ్లీలో సంఖ్యాబలం పెంచుకోవడం బీజేపీకి సుదూర కలగానే మిగులుతుందని వ్యాఖ్యానించారు.

తాజా పరిణామాలపై స్పందించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ నిరాకరించారు. శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ దళిత అభ్యర్థి ఓటమితో తప్పుడు సందేశం ప్రజల్లోకి వెళుతోందన్నారు. తప్పు ఎక్కడ జరిగింది.. ఎమ్మెల్యేలు ఎంతమంది క్రాస్ ఓటింగ్ చేశారు.. ఆ ఓట్లు ఎక్కడికి వెళ్లాయో తెలియాల్సి ఉందని చవాన్ అన్నారు. కాంగ్రెస్ మంత్రి బాలాసాహెబ్ థోరత్ స్పందిస్తూ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా ముంబైలోనే ఉండాలని సూచించినట్లు తెలిపారు. తాజా రాజకీయ పరిణామాలతో ఏఐసీసీ పరిశీలకుడిగా సీనియర్ నేత కమల్‌నాథ్‌ను కాంగ్రెస్ నియమించింది. మరోవైపు ఏక్‌నాథ్ షిండేకు కేంద్రమంత్రి, బీజేపీ నేత నారాయణ్ రాణే బహిరంగంగా మద్దతు తెలిపారు.

చిన్న పార్టీలు, స్వతంత్ర ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం

ఎంవీయే ప్రభుత్వంపై నీలినీడల కమ్ముకోవడంతో చిన్న పార్టీలు, స్వతంత్ర ఎమ్మెల్యేలు 29 మందికి ప్రాధాన్యత పెరిగింది. వారి మద్దతుపై చర్చ మొదలైంది. శివసేన ఎమ్మెల్యే రమేశ్ లట్కే మరణంతో అసెంబ్లీలో ప్రస్తుతానికి ఒక స్థానం ఖాళీగా ఉంది. అధికారంలో ఉండాలంటే ఏ పార్టీ లేదా కూటమికి 144 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. 2019 నవంబరు 30న అసెంబ్లీలో విశ్వాస ఓటును ఎంవీయే 169 మంది ఎమ్మెల్యేల మద్దతుతో గెలిచింది. బీజేపీ వద్ద 2019లో 105 స్థానాలు ఉంటే ఉపఎన్నికల్లో ఒక సీటు గెలుచుకొని దాని సంఖ్యను 106కు పెంచుకుంది. 13 మంది స్వతంత్రుల్లో రాజేంద్ర పాటిల్ యడ్రావ్కర్, క్రాంతికారి షేత్కారీ పక్ష ఎమ్మెల్యే శంకర్రావు గఢక్, ప్రహార్ జనశక్తి పార్టీకి చెందిన బచ్చు ఖడు మంత్రులయ్యారు. స్వతంత్రుల్లో ఆరుగురి మద్దతు బీజేపీకి ఉంది. ఐదుగురు శివసేన పక్షాన ఉన్నారు. కాంగ్రెస్, ఎన్‌సీపీకి ఒక్కొక్కరి మద్దతు ఉంది. మొత్తం 288 మంది సభ్యులు ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీలో శివసేనకు 55 ఎమ్మెల్యేలు ఉంటే ఎన్‌సీపీకి 53, కాంగ్రెస్‌కు 44 మంది ఉన్నారు.

బహుజన్ వికాస్ అగాఢీకి ముగ్గురు, సమాజ్‌వాదీ పార్టీ, ఏఐఎంఐఎం, ప్రహార్ జనశక్తి పార్టీలకు చెరో ఇద్దరు, ఎంఎన్ఎస్, సీపీఎం, పీడబ్ల్యూ, స్వాభిమానీ పక్ష, రాష్ట్రీయ సమాజ్ పార్టీ, జనసూరజ్యా శక్తి పార్టీ, క్రాంతికారి షేత్కారీ పక్ష పార్టీలకు ఒక్కొక్కరు చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు.

భారతీయ న్యాయస్థానాలు నిష్పాక్షికం

మధ్యవర్తిత్వంలో పెరుగుతున్న కోర్టుల జోక్యంపై ఆందోళన వద్దు

ఇండో-జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సమావేశంలో సీజేఐ రమణ

న్యూఢిల్లీ : మధ్యవర్తిత్వ ప్రక్రియలో ప్రాంతీయ కోర్టుల జోక్యం పెరుగుతుండటంపై భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ మంగళవారం ఆందోళన అక్కర్లేదని అన్నారు. భారతీయ న్యాయవ్యవస్థ అన్ని పక్షాలనూ ఒకేలా చూస్తుందని, విదేశీ వ్యవస్థలనూ సమానంగా పరిగణిస్తుందని చెప్పారు. అన్ని వ్యవహారాల్లో న్యాయంగా ఉంటుందన్నారు. 'ఇటీవల కాలంలో ఇదే అంశమై చాలా మంది మదిలో సందేహాలు ఉన్నాయి. భారతీయ కోర్టులు మధ్యవర్తిత్వానికి మారుపేర్లు. భారతీయ కోర్టులు ఈ పద్ధతికి మద్దతిస్తాయి. అవసరమైన సహాయక సహకారాలనూ అందిస్తాయి. తీర్పులో ముఖ్యమైన భాగ్యాన్ని అర్బిట్రల్ ట్రిబ్యునల్‌కే వదిలేస్తాయి' అని సీజేఐ రమణ అన్నారు. 'ప్రపంచంలో మధ్యవర్తిత్వం-జర్మనీలోని డార్ట్‌మండ్‌లో భారతీయ అనుభవం' థీమ్‌పై జరిగిన ఇండో-జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. ప్రభుత్వ ప్రతి చర్యను న్యాయపరంగా సమీక్షించే అధికారం భారత్‌లోని రాజ్యాంగబద్ధ న్యాయస్థానాల (హైకోర్టులు, సుప్రీంకోర్టు)కు ఉంటుందని చెప్పారు. రాజ్యాంగ సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉన్న చట్టాన్ని కోర్టులు రద్దు చేయొచ్చు అని అన్నారు. తమ సమస్యల పరిష్కారాని దేశంలోని ఏదేని న్యాయ ఫోరాన్ని ఆశ్రయించే అవకాశాన్ని విదేశీ బాధితులకూ భారతీయ రాజ్యాంగం కల్పిస్తుందని సీజేఐ రమణ తెలిపారు. దేశాన్ని బట్టి కోర్టులు పక్షపాతం చూపవన్నారు. చట్టానికి అంతా సమానమన్నారు. వాణిజ్య వివాదాల త్వరితగత పరిష్కారానికి వాణిజ్య కోర్టు చట్టానికి పార్లమెంటు ఆమోదం తెలిపిందని చెప్పారు. దీర్ఘకాల వాణిజ్య వివాదాల పరిష్కారానికి చట్టాలను సైతం సవరించిన సందర్భాలు ఉన్నాయని సీజేఐ రమణ తెలిపారు.

విపక్షాల ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ఎన్నికకు విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి యశ్వంత్ సిన్హా పేరు ఖరారైంది. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ నేతృత్వంలో జరిగిన విపక్షాల భేటీలో చర్చించాక యశ్వంత్ సిన్హా పేరు ఖరారైనట్లు విపక్షాలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సహా అనేక విపక్షాలు సిన్హాకు మద్దతు ప్రకటించాయి. ప్రతిపక్ష పార్టీలన్నీ యశ్వంత్ సిన్హా పేరును ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రకటించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసేందుకు యశ్వంత్ సిన్హా సుముఖత వ్యక్తం చేశారు. ఈనెల 27న ఉదయం 11.30గంటలకు రాష్ట్రపతి అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా నామినేషన్ దాఖలు చేయనున్నట్టు శరద్ పవార్ వెల్లడించారు. జులై 18న రాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్ నిర్వహించనుండగా.. 21న ఓట్ల లెక్కింపు జరగనుంది. శరద్ పవార్ నేతృత్వాన మంగళవారం పార్లమెంట్ అనెక్స్‌లో విపక్షాలు భేటీ అయ్యాయి. సిన్హా పేరును ప్రతిపక్షాలు ఏకగ్రీవంగా అంగీకరించాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా సిన్హా పేరు ఖరారు కావడం సంతోషంగా ఉందని జైరాం రమేశ్ చెప్పారు. సమావేశం అనంతరం ఉమ్మడి ప్రకటనను జైరాం రమేశ్ మీడియాకు చదివి వినిపించారు. 'ప్రజా జీవితంలో యశ్వంత్‌సిన్హా అనేక పదవులు అలంకరించారు. గొప్ప పాలనాదక్షుడు. ఉత్తమ పార్లమెంటేరియన్. వాజ్‌పేయి హయాంలో ఆర్థిక, విదేశాంగమంత్రిగా పనిచేశారు. లౌకిక, ప్రజాస్వామిక విలువలకు కట్టుబడిన నేత. రాజ్యాంగ విలువలకు బద్ధుడు' అని ఆ ప్రకటన పేర్కొంది. రాష్ట్రపతిగా యశ్వంత్‌సిన్హాను ఏకగ్రీవంగా ఎన్నుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. రాష్ట్రపతి అభ్యర్థిపై ఏకాభిప్రాయం సాధించడానికి మోదీ సర్కారు కనీస ప్రయత్నం చేయలేదని జైరాం రమేశ్ విమర్శించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకి పవార్, గోపాలకృష్ణ గాంధీ, ఫరూక్ అబ్దుల్లా నిరాకరించిన తర్వాత యశ్వంత్‌సిన్హా పేరు తెరపైకి వచ్చింది. విపక్షాల సమావేశానికి కాంగ్రెస్, ఎన్‌సీపీ, టీఎంసీ, సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాదీ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఎంఐఎం, ఆర్‌జేడీ, ఏఐయూడీఎఫ్ సహా ఇతర పార్టీలు హాజరయ్యాయి. కాంగ్రెస్ నుంచి మల్లికార్జున ఖర్గె, జైరాం రమేశ్, తృణమూల్ నుంచి అభిషేక్ బెనర్జీ, డీఎంకే నుంచి తిరుచి శివ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొన్నారు. టీఆర్ఎస్, బీజేడీ, ఆప్, ఎస్ఏడీ, వైసీపీ సమావేశానికి దూరంగా ఉన్నాయి. కాగా, దీనికి ముందు యశ్వంత్‌సిన్హా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. దేశప్రయోజనాలు, విపక్షాల ఐక్యత కోసం టీఎంసీని వదులుకోవాల్సి వచ్చిందని సిన్హా చెప్పారు.

ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్ము

ఢిల్లీ: నాటకీయ పరిణామాల అనంతరం రాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ అభ్యర్థిగా ద్రౌపది ముర్మును బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో అభ్యర్థిని ఎంపిక చేసేందుకు మంగళవారం సాయంత్రం బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశమైంది. సమావేశం ముగిసిన అనంతరం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్ము పేరును ప్రకటించారు. అనేకమంది పేర్లు ప్రస్తావనకు వచ్చినప్పటికీ... రాష్ట్రపతిగా ఎస్టీ మహిళను చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్డీఏ పక్షాలు అన్నింటితో చర్చించిన తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు నడ్డా ప్రకటించారు. జార్ఖండ్ గవర్నర్‌గా పనిచేసిన ద్రౌపది ముర్ము విశేష ప్రతిభాశాలి అని నడ్డా తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రపతిగా పనిచేసే అవకాశం గిరిజన వర్గాల వారికి లభించలేదని, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ముర్మును ఎంపిక చేసినట్లు చెప్పుకొచ్చారు. ముర్ము మంత్రిగా, గవర్నర్‌గా మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. ద్రౌపది ముర్ము ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా బైడపోసిలో జన్మించారు. జార్ఖండ్ గవర్నర్‌గా పనిచేశారు. ద్రౌపది ముర్ము భర్త పేరు శ్యామ్‌చరణ్ ముర్ము. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వెంకయ్యనాయుడుతో చర్చలు: పార్లమెంటరీ బోర్డు సమావేశానికి ముందు బీజేపీ అగ్రనేతలు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సమావేశమయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెంకయ్యతో సుమారు 50 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ఉదయం సికింద్రాబాద్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు... ఆ కార్యక్రమం పూర్తి కాగానే ఆయన హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు.

రాహుల్‌పై ఈడీ ప్రశ్నల వర్షం!

ఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఐదోరోజు విచారించింది. మంగళవారం ఉదయం నుంచి దాదాపు 10 గంటల పాటు విచారణ ఎదుర్కొన్న రాహుల్ గాంధీ.. సాయంత్రం 8గంటలకు ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. మనీ లాండరింగ్ కేసులో రాహుల్ గాంధీని విచారిస్తోన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.. గతవారం మూడురోజుల్లో దాదాపు 30 గంటలపాటు విచారించింది. మళ్లీ సోమవారం పది గంటలపాటు విచారణ జరపగా.. మంగళవారం కూడా సుదీర్ఘ సమయం పాటు ప్రశ్నల వర్షం కురిపించింది. ఇలా ఇప్పటివరకు ఈ ఐదురోజుల్లో రాహుల్ గాంధీని దాదాపు 50గంటల పాటు ఈడీ విచారించినట్లయ్యింది.

మరోవైపు ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా జూన్ 23న ఈడీ ముందు హాజరు కావాల్సి ఉంది.

కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కారుణ్య నియామకాల్లో వెంటనే చేపట్టాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తాడేపల్లిలో సీఎం అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజును కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, అమలయ్యే పరిస్థితి లేదన్నారు. పాఠశాల విద్య, ఎయిడెడ్, మున్సిపల్, మోడల్ స్కూల్ తదితర విద్యా సంస్థల్లో అవసరమైన ఖాళీలు లేనందున, ఇతర శాఖల్లోని ఖాళీల్లో నియామకాలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని కత్తి నరసింహారెడ్డి చెప్పారు. గ్రాంట్ ఇన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాక సిబ్బందికి 62ఏళ్ల పదవీ విరమణను వర్తింప చేయాలని కోరినట్లు తెలిపారు.

విద్యాశాఖ మంత్రి బొత్సాకు ఎస్టీయూ నేతల వినతి

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను వివిధ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఎస్టీయూ నేతలు వినతిపత్రం అందచేశారు. ఈ మేరకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన్న మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 17 జీవోలో ఉన్న లోపాలను సవరించాలని కోరగా, త్వరలోనే అధికారులతో చర్చించి నిర్ణయిస్తామని వెల్లడించారు. జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం ఇవ్వాలని, గరిష్ఠంగా ఎనిమిదేళ్ల సర్వీసుకు తప్పనిసరి బదిలీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

నా భర్త కనిపించడం లేదు

పోలీసులకు శివసేన ఎమ్మెల్యే భార్య ఫిర్యాదు

అకోలా: తన భర్త కనిపించడం లేదని శివసేన ఎమ్మెల్యే నితిన్ దేశ్‌ముఖ్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసు అధికారి ఒకరు మంగళవారం చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంపై మంత్రి ఏక్‌నాథ్ షిండే, మరో కొంతమంది శివసేన ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసిన విషయం విదితమే. అకోలా జిల్లా బాలాపూర్ నియోజకవర్గానికి నితిన్ దేశ్‌ముఖ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అకోలాలోని సివిల్ లైన్స్ పోలీసు స్టేషన్‌లో దేశ్‌ముఖ్ భార్య ప్రాంజలి దేశ్‌ముఖ్ ఫిర్యాదు చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి తన భర్త ఇంటికి రాలేదని, కనీసం ఫోన్ కూడా తీయడం లేదని, ఎక్కడున్నారో కనిపెట్టాలని ఆమె పోలీసులను వేడుకున్నారు.

ఒడిశాలో మావోల మెరుపుదాడి...

ముగ్గురు జవాన్లు మృతి

భువనేశ్వర్ : ఒడిశాలోని నౌపాడ జిల్లాలో మావోయిస్టులు విరుచుకు పడ్డారు. బోడెన్ బ్లాక్‌లో సీఆర్పీఎఫ్ జవాన్లపై కాల్పులకు పాల్పడ్డారు. దీంతో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. మరో ఏడుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రారంభోత్సవం కార్యక్రమం భద్రతకు సీఆర్పీఎఫ్ జవాన్లు వెళ్లారు.

వంద శాతం ముప్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అగ్నిపథ్ పథకంతో దేశానికి వందశాతం ప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వం చెప్పారు. అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా మంగళవారం విజయవాడ దాసరిభవన్‌లో వామపక్ష పార్టీల అధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పోలారి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నేత డి.హరినాథ్, ఎస్‌యూసీఐ(సీ) నేత అమర్‌నాథ్, ఎంసీపీఐ(యూ) నాయకుడు ఖాదర్ బాషా తదితరులు హాజరయ్యారు. వినయ్ విశ్వం ప్రసంగిస్తూ అగ్నిపథ్ పథకాన్ని వాపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. నాలుగేళ్లు సైనికులుగా పనిచేసిన తర్వాత వారేం చేస్తారని ప్రశ్నించారు. సమోసాలు తయారు చేయడం,వీధి అమ్మకందారులుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాసిస్టు నేతలు హిట్లర్, ముస్సోలినీ నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రేరణ పొందిందని ఆరోపించారు.

వారి సిద్ధాంతాలను మోదీ సర్కారు అనుసరిస్తున్నదని మండిపడ్డారు. మాజీ సైనికులతో బీజేపీ, ఆరెస్సెస్ మారణహోమం సృష్టించే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ పథకం ద్వారా వచ్చిన సైనికులకు పెన్షన్‌తోపాటు ఇతర రాయితీలు ఉండబోవన్నారు. రక్షణరంగంలో పూర్తిస్థాయి సైనికులుగా చేరడానికి పోరాటం చేస్తున్న యువతకు

వామపక్షాలు సంపూర్ణ మద్దతిస్తున్నాయని ప్రకటించారు. అగ్నిపథ్‌పై కేంద్రం పునరాలోచన

విశాలాంధ్ర 70వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన వినయ్ విశ్వంకు గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న విల్సన్, హరినాథ్‌రెడ్డి, మనోహరనాయుడు

చేయాలని డిమాండు చేశారు.

ఎస్‌కేఎం ఆందోళనకు మద్దతు: రామకృష్ణ

కె.రామకృష్ణ మాట్లాడుతూ సైనికులు కావాలని కోరుకుంటున్న యువత ఆశయాలను మోదీ ప్రభుత్వం నీరు గారుస్తోందన్నారు. సైనిక ఉద్యోగాలను నాలుగేళ్లకే పరిమితం చేసి, ఆ తర్వాత వారిని బీజేపీ కార్యాలయాల్లో భద్రతా సిబ్బంది, దోబీలుగా మారుస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు బీజేపీ నేతలు పరోక్షంగా వ్యాఖ్యలు చేశారన్నారు. అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పెద్దఎత్తున యువత ఉద్యమించిందన్నారు. పోలీసు తూటాలకు ఓ యువకుడు చనిపోయినప్పటికీ వెనుకంజ వేయకుండా ప్రాణాలు సైతం లెక్క చేయకుండా మిలిటెంట్ తరహా ఉద్యమం కొనసాగించారని కొనియాడారు. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంతోపాటు దేశవ్యాప్తంగా అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తాయన్నారు. జగన్ ప్రభుత్వం మోదీకి వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. సైనిక పరీక్షల్లో అర్హత సాధించిన ఏపీకి చెందిన 32 మంది యువకులను అన్యాయంగా పోలీసులు అరెస్టు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారానికి పంపడం దుర్మార్గమని పేర్కొన్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండు చేశారు. అగ్నిపథ్‌పై ఈనెల 24వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనలకు వామపక్షాలు మద్దతిస్తున్నట్లు చెప్పారు.

వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. అగ్నిపథ్‌తో సైనిక ఉద్యోగాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. దేశ రక్షణకు ఆయువుపట్టుగా ఉండే సైనిక వ్యవస్థను కార్పొరేట్ రంగానికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. నాలుగేళ్ల తర్వాత బయటకు వచ్చిన సైనికులు ఏమి చేయాలని కేంద్రాన్ని నిలదీశారు. అరెస్సెస్, బీజేపీ వ్యక్తిగత అవసరాలకు వారిని వినియోగించుకునే దిశగా మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. వైసీపీ, టీడీపీ, జనసేన మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అగ్నిపథ్‌పై వైఖరిని ఆ పార్టీలు ఇప్పటికీ స్పష్టం చేయలేదన్నారు. ఏపీకి చెందిన 32 మంది యువకులను అన్యాయంగా అరెస్టు చేసి, జైలుకు పంపితే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. పోలారి మాట్లాడుతూ అగ్నిపథ్ వల్ల దేశానికి ప్రమాదం పొంచి ఉందని, వామపక్షాలు ఐక్యతతో ఉద్యమించాలని కోరారు. డి.హరినాథ్ మాట్లాడుతూ మోదీ విధానాలతో రక్షణరంగం పూర్తిగా నిర్వీర్యం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాదర్ బాషా మాట్లాడుతూ బీజేపీ, ఆరెస్సెస్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని కోరారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ స్వాగతం పలుకుతూ దేశభక్తికి మారుపేరుగా చెప్పుకునే బీజేపీ...అగ్నిపథ్ పేరిట సైనిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు.

తొలుత అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమంలో అమరులైన 12 మంది యువకులకు వై.వెంకటేశ్వర్లు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, పెంచలయ్య, నాయకులు నజీర్, ఆర్.పిచ్చయ్య, అనిల్, కవి, అప్పన్న తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు. సదస్సుకు వామపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు.

కార్పొరేట్ల కోసమే అగ్నిపథ్

పెన్షన్ భారం తగ్గించుకోవడానికి కుట్ర
రైతులపై జగన్ నిర్లక్ష్యం
ఆందోళనకారులపై కేసులు ఎత్తివేయాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై ముప్పాళ్ల, జంగాల అజయ్‌కుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, హనుమంతరావు తదితరులు

విశాలాంధ్ర-గుంటూరు: పెన్షన్ భారాన్ని తగ్గించు కోవడానికి మోదీ ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శిం చారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో రామకృష్ణ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అగ్నిపథ్‌ను రద్దు చేయాలని ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి, యువజనులు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోందని మండిపడ్డారు. అగ్నిపథ్ పథకాన్ని బీజేపీ నేతలు, కార్పొరేట్ వర్గాలు తప్ప దేశమంతా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఈ పథకం కింద సైన్యంలో చేరిన నాలుగేళ్లకే సైనికులను ఇంటికి పంపుతారని, ఆ తర్వాత తక్కువ వేతనాలకు తమ వద్ద ఉంచుకోవచ్చని కార్పొరేట్ శక్తులు అగ్నిపథ్‌ను స్వాగతిస్తున్నాయని వివరించారు. బట్టలు ఉతకడం, కార్పెంటర్ పనులు నేర్పుతామని ఓ బీజేపీ నేత అంటే...మరో నాయకుడు..బీజేపీ కార్యాలయాల వద్ద సెక్యూరిటీ గార్డులుగా పెట్టుకుంటామని అంటున్నాడని, బీజేపీ నేతలు ఇలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అగ్నిపథ్ ఆందోళనలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని, అయినా గుంటూరులో జిల్లాలో 31 మందిపై కేసులు పెట్టి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారన్నారు. వారు హింసకు పాల్పడ్డారా... ధర్నాలు చేశారా...ర్యాలీలు నిర్వహించారా అని నిలదీశారు. పోలీసులు కేసులు పెట్టి యువత జీవితాలను, భవిష్యత్‌ను నాశనం చేశారని ధ్వజమెత్తారు. యువకుల అరెస్టుకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని రామకృష్ణ ఆరోపించారు. కరువు, వెనుకబడిన ప్రాంతాలలో సబ్సిడీ నిలిపివేశారని, ఇన్‌పుట్ సబ్సిడీ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 49 లక్షల మంది ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని, 30.60 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్య చెప్పారని, కానీ 15.60 లక్షల ఎకరాలకు మాత్రమే బీమా చెల్లించారన్నారు. ముఖ్యమంత్రి దీనిపై స్పందించాలని, ప్రభుత్వం వద్ద ఉన్న జాబితా ప్రకారం పంట నష్టపోయిన ప్రతిఒక్కరికీ బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు బాగుంటే క్రాప్ హాలిడే ఎందుకు ప్రకటిస్తారని ప్రశ్నించారు. మూడు పంటలు పండించే బంగారు భూమి కోనసీమలో ఉందని, నీరు సమృద్ధిగా ఉందని, అలాంటి చోట క్రాప్ హాలిడే ప్రకటిస్తామని, వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత సైన్యానికి ప్రపంచంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, సైన్యంలో చేరాలనే యువత గొంతును అగ్నిపథ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కోసిందని విమర్శించారు. సైనికుడని చెప్పుకునే అవకాశం లేకుండా దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. సామాన్య పేదలు అత్యున్నత త్యాగాలు చేయడానికి అవకాశం ఉన్న సైన్యాన్ని నిర్వీర్యం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే కేంద్రం అగ్నిపథ్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత జీవితాలతో చెలగాటమాడటం సమంజసం కాదన్నారు. దీనిపై జగన్‌మోహన్‌రెడ్డి స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం అమరావతి మహిళా రైతుల మహోజ్వల యాత్రపై పోపూరి శివరామకృష్ణ రచించిన 'అడుగడుగు... ఆశయసాధనకే...' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం ఆకాంక్షించే విశాలాంధ్ర: పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిష్కళం కమైన, నిష్పక్షపాతమైన వార్తా కథనాలతో సమాజాన్ని జాగృతం చేసే దిశగా ఏడు పదుల సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని విశాలాంధ్ర దినపత్రిక సాగించడం అపూర్వమని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రశంసించారు. అలాంటి ఘనత ఉన్న ప్రజా చైతన్య మార్గంలో నడుస్తున్న పత్రిక విశాలాంధ్ర అని పేర్కొన్నారు. కార్మిక, రైతు, పేద వర్గాల గొంతును అక్షరాల్లో సమాజానికి అందించడమే విద్యుక్త ధర్మంగా ఎంచుకుందన్నారు. ఒక పార్టీకి అనుబంధంగా నడిచే పత్రిక అయినప్పటికీ, పార్టీ భావజాల వ్యాప్తికే పరిమితం కాకుండా, వాస్తవిక దృక్కోణంతో ప్రజా ప్రయోజనం కాంక్షిస్తూ వార్తా కథనాలు అందించడం అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో మారుతున్న మీడియా పోకడలను తట్టుకుంటూ 70వసంతాలను నిర్విఘ్నంగా పూర్తి చేయడం గౌరవ ప్రదమని పేర్కొన్నారు. విశాలాంధ్ర యాజమాన్యానికి, సంపాదక బృందానికి, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

హైకోర్టులో యోగా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నేలపాడులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశ ప్రధాని మోదీ మైసూరు పాలెస్ నుంచి ఇచ్చిన సందేశాన్ని ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు, సభ్యులు, హైకోర్టు సిబ్బంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం యోగా మాస్టర్ బి.మల్లికార్జునరావు నేతృత్వంలో వారి సూచనలకు అనుగుణంగా యోగాభ్యాసాలను వారంతా ఆచరించారు. ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ విశ్వమానవాళికి దేశం అందించిన గొప్ప అభ్యసనాలు యోగాసనాలు అని కొనియాడారు. యోగా ఫర్ హ్యూమానిటీ అనే థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. నిత్య నూతనోత్సాహాన్ని, శక్తిని కలిగించే యోగాసనాలను ప్రతి ఒక్కరూ నిత్యం ఆచరించాలని కోరారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్, హైకోర్టు అడ్వకేట్ల అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామి రెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా రామారావు తదితరులతోపాటు వివిధ హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'విట్'లో ఘనంగా యోగా డే

విశాలాంధ్ర-విజయవాడ: వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ యోగా శిక్షకురాలు టేకుమూడి శిరీష హాజరయ్యారు. యోగా శారీరక వ్యాయా మం మాత్రమే కాదని, యోగా ద్వారా మనలో అంతర్లీన శక్తిని మేల్కొలపవచ్చని ఆమె చెప్పారు. మానసిక, శారీరక అభివృద్ధికి యోగా అవసరమని తెలిపారు. ప్రాణాయామం, ఉష్ట్రాసనం, మత్స్యాసనం, ధనురా సనం, బాలాసనం, గోముఖా సనం వంటి కొన్ని ఆసనాలను ప్రదర్శించి, విద్యార్థులతో చేయించారు. వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ... ప్రాణాయామం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలన్నారు. శ్వాసపై నియంత్రణను పొందడం ద్వారా శరీరం ఎటువంటి అద్భుతాలు చేయగలదో ఇది నేర్పుతుందని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి మాట్లా డుతూ... డాక్టర్లు నయం చేయలేని జబ్బులను సైతం యోగా ద్వారా నయం చేసుకోవచ్చని, దైనందిన జీవితంలో యోగాను చేర్చుకోవడం అనేది ప్రజలు చేయ గలిగే ఆరోగ్యవంత అభ్యాసాలలో ఒకటని అన్నారు. విశ్వవిద్యాలయ దత్తత గ్రామాలైన ఐనవోలు, శాఖమూరు, వెలగపూడికి చెందిన విద్యార్థులకు మూడో వార్షిక ఉచిత సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపు ముగియనుండటంతో ఆ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. యూని వర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ అనుపమ నంబూరు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు, కోచ్‌లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేట్రేగిన బుల్డోజర్ సంస్కృతి: జేవీఎస్ఎన్ మూర్తి

లోగో ఆవిష్కరిస్తున్న జేవీఎస్ఎన్. చిత్రంలో స్టాలిన్, ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-విశాఖ: దేశ వ్యాప్తంగా బుల్డో జర్ సంస్కృతి పెట్రేగి పోతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 27వ మహాసభల నేపథ్యంలో ఆహ్వాన సంఘం తరపున జరుగుతున్న ఏర్పాట్లు మంగళవారం విశాఖలోని పార్టీ కార్యాల యంలో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 26 నుంచి మూడు రోజుల పాటు నగరంలో జరుగనున్న పార్టీ రాష్ట్ర 27వ మహాసభలకు సంబంధించిన లోగోను సీపీఐ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ప్యాట్రన్ ఆచార్య చెంచు సుబ్రహ్మణ్యంలతో కలిసి ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా పాలకులు చేస్తున్న అన్యాయంపై పౌర సమాజం, ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను భరించలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి నివాసాలపై బుల్డోజర్లతో దాడులకు దిగడాన్ని జేవీఎస్ ఎన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ ఉత్తరాదిరాష్ట్రాల్లో మొదలు పెట్టిన బుల్డోజర్ సంస్కృతి ఏపీలోకి ప్రవేశించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. యూపీ తదితర రాష్ట్రాల్లో పట్టపగలే ప్రజల నివాసాల్ని బుల్డోజర్లతో కూల్చి వేస్తుంటే రాష్ట్రంలో రాత్రి పూట ఆ పని చేస్తున్నారని దుయ్యబట్టారు. అగ్నిపథ్ పేరుతో సైన్యంలోకి కాంట్రాక్టు విధా నాన్ని తేవాలని కేంద్రం కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల అనంతరం అగ్నివీరుల పని ఏమిటని నిలదీశారు. ప్రభుత్వానికి కార్పొరేట్ శక్తులు వత్తాసు పలక డాన్ని తప్పుబట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ జరగాల్సి ఉందని చెప్పారు. ఆగస్టు 26న భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, 27, 28 తేదీల్లో సిరిపురం జంక్షన్‌లోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఏరినాలో ప్రతినిధుల సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు ఎనిమిది వందల మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభల్లో కేంద్రం, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు ఎజె స్టాలిన్, ఉప ప్రధాన కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కోశాధికారి ఎం పైడిరాజు, ఎ విమల, కె సత్యనారాయణ, ఎం. రామునాయుడు జిఎస్‌జె. అచ్యుతరావు తదితరులతో పాటు ఆహ్వాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, బ్రిడ్జీలు, ఆర్వోబీలు, ఫ్లైఓవర్లను పూర్తి చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు. రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనుల ప్రగతిపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం సమీక్షించారు. నివర్ తుపాన్ కారణంగా కొట్టుకుపోయిన ప్రాంతాల్లో కొత్త బ్రిడ్జీల నిర్మాణాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. కార్పొ రేషన్లు, మున్సిపాలిటీల్లో జూలై 15 నాటికి గుంతలు పూడ్చాలని, 20న ఫోటో గ్యాలరీలు పెట్టాలని సూచిం చారు. పంచాయతీ రాజ్ రోడ్లకు సంబంధించి ఇప్పుడు చేపడుతున్న పనులే కాకుండా, క్రమం తప్పకుండా నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో మరమ్మతులు, స్పెషల్‌వర్క్స్ కింద మొత్తంగా 7804 కిలోమీటర్ల మేర పనులు చేపట్టినట్లు, దీనికోసం రూ.2205 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోం దన్నారు. ఇప్పటికే 675 పనులు పూర్తి చేశామని, మరో 491 పనులు కొనసాగుతున్నాయన్నారు. మొత్తంగా 62.09శాతం పనులు పూర్తకాగా ఇందుకు రూ.1369 కోట్ల ఖర్చు చేసినట్టు తెలిపారు. నాబార్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ కింద చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయని సీఎంకు అధికారులు వివరించారు. 233 పనుల కోసం రూ.2479.61 కోట్ల పనుల్లో రూ.1321.08 కోట్లు ఖర్చు చేశామన్నారు. సీఎం మాట్లాడుతూ... పంచాతీరాజ్ రోడ్ల మరమ్మతులు, నిర్మాణంపైనా దృష్టి పెట్టాలన్నారు. ఈ పనుల కోసం 1843 రోడ్లకు రూ.1072.92 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, 4635 కిలోమీటర్ల మేర రోడ్లను మరమ్మతులు చేయనుందని తెలిపారు.

కేసులతో అభివృద్ధికి ఆటంకం : సీఎం జగన్

రాష్ట్రంలో అభివృద్ధి పనులు సాగకుండా ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని సీఎం జగన్ ఆరోపించారు. ప్రభుత్వానికి రుణాలు ఇవ్వకూడదని, కేంద్రం నుంచి డబ్బులు రాకూడదని, కేసుల ద్వారా అడ్డుకోవాలని, తద్వారా అభివృద్ధి పనులు ఆగిపోవాలని ప్రతిపక్షాలు ఒక అజెండాతో పనిచేస్తున్నాయని విమర్శించారు. అయినా సడలి సంకల్పంతో ముందుకుసాగుతున్నామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, రోడ్లు-భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, సీఎస్ సమీర్ శర్మ, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టండి

మాట్లాడుతున్న శంకర్. వేదికపై శ్రీనివాస్, నరసింహారావు, శివారెడ్డి, ఆజమ్, వెంకటేశ్వర్లు, జాన్సన్‌బాబు

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ఇదే సరైన సమయమని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై వైసీపీ, టీడీపీ ఒత్తిడి తీసుకురావాలని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, విజయవాడ నగర కన్వీనర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్వర్యాన మంగళవారం నగరంలోని ఓ హోటల్లో వివిధ ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి చలసాని శ్రీనివాస్, దోనేపూడి శంకర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలంటే ఏపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల ఓట్లు అవసరమని, అందువల్ల ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని కేంద్రం ప్రకటించే విధంగా ఒత్తిడి తీసుకురావాలన్నారు. గతంలో హోదా కోసం జగన్ ఇచ్చిన హామీని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభలో కలిపి వైసీపీకి 32 మంది ఎంపీలు ఉన్నారని, కేంద్రం మెడలు వంచాలని, తమ స్వార్థం కోసం బీజేపీ ముందు తల వంచవద్దని కోరారు. బీజేపీ స్పష్టమైన ప్రకటన చేసే వరకు రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ప్రకటించవద్దని విజ్ఞప్తి చేశారు. స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు నిస్సిగ్గుగా మోదీ ప్రాపకం కోసం పాకులాడుతున్నాయని విమర్శించారు. అడుగడుగునా ఆంధ్రకు అన్యాయం చేస్తున్న బీజేపీని రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై మోదీ పగబట్టినా, రాష్ట్ర ప్రజలు అందరూ అండగా ఉంటారని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని, ఎన్నికల హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జులై 4న రాష్ట్రంలో పర్యటించేందుకు వస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి స్పందంచి ఆంధ్రాకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర్లు, ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి మహబూబ్ ఆజం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి సహాయ కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం అన్ని ప్రజా సంఘాలు కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. మోదీ పర్యటన సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తామన్నారు. డీహెచ్‌పీఎస్ నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ముమ్మరం చేయాల్సిన అవసరముందని ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నేతలు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 495వ రోజుకు చేరుకున్నాయి. కోక్ ఓవెన్ విభాగానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్న శిబిరంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, ప్రతినిధి వరసాల శ్రీనివాస రావు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తేనే కేంద్రం దిగివస్తుందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రం పై ఒత్తిడి తీసుకు రావడానికి అందరినీ కలుపుకొని పోరాడాలన్నారు. ఉక్కు కార్మిక వర్గం ఈ మహోద్యమంలో ప్రజలను చైతన్య పరిచి ఉద్యమం వైపు మళ్లించాల్సి ఉందన్నారు. ఉక్కు ఉద్యమ సెగ ఢిల్లీకి తాకాలన్నారు. ఈ దీక్షల్లో ఉక్కు ఉద్యోగులు శివరామ కృష్ణ, జ్యోతి ప్రసాద్, తాండ్ర కనక రాజు, బి.కామేశ్వరరావు, ఎం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బాసర పోరాటం... ప్రభుత్వానికి ఓ గుణపాఠం

తిరుపతి: పట్టు వదలకుండా తమ సమస్యలపై పోరాటం కొనసాగించి ప్రభుత్వ మెడలు వంచిన బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులను సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అభినందించారు. విద్యార్థుల సమస్యలను సిల్లీ సమస్యలంటూ వ్యాఖ్యానించిన విద్యాశాఖ మంత్రి చేత తమ సమస్యల పరిష్కారం విషయంలో రాత పూర్వ హామీ తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. బాసర విద్యార్థుల పోరాటం ప్రభుత్వానికి ఒక గుణపాఠమని చెప్పారు. ఒక ఉద్యమం మొదలైతే అందులోని అంశాలను పరిశీలించకుండా...గుడ్డిగా వ్యతిరేకించి లేనిపోని వ్యాఖ్యానాలు చేస్తూ తప్పించుకోవాలని చూడడాన్ని తప్పుబట్టారు. బాసర విద్యార్థుల సమస్యలను ఇలాగే చూశారని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా పోలీసు క్యాంపులు పెట్టి, మావోయిస్టులు నడుపుతున్నారనే మిషతో అణచివేయాలని చూశారని గుర్తు చేశారు. వాస్తవానికి ఆ విద్యార్థుల సమస్యలు తీర్చలేనివి కాదని పేర్కొన్నారు. పది రోజుల పోరాటం చేస్తే తప్ప తీర్చలేని సమస్యలే కాదని వ్యాఖ్యానించారు. బాసర విద్యార్థులు ఆందోళన ప్రారంభించిననాడే పరిష్కారం చూపి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. కానీ మంత్రులు అసమర్థులుగా ఉండడమే సమస్యల పరిష్కారంలో ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. ప్రతి సమస్యను సీఎం కేసీఆర్ చూస్తే తప్ప పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. ఆయన వివిధ పనుల్లో మునిగిపోయిన క్రమంలో సమస్యలు పేరుకుపోతున్నాయని చెప్పారు. సీఎం తప్ప మంత్రివర్గమంతా అసమర్థులైతే ఇటువంటి చెడు ఫలితాలే ఎదురవుతాయనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గమనంలోకి తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు



విశాలాంధ్ర-విజయవాడ: పాలకులు బాధ్యతను విస్మరించి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటుకు అప్పగిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు విమర్శిం చారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి నష్టాల పేరుతో ప్రైవేటీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఎస్ఎన్ఎల్‌కు ఇప్పటికీ పూర్తి స్థాయిలో 4జీ స్పెక్ట్రమ్ కేటాయించకపోవడమే నిదర్శనమన్నారు. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఆఫ్ బీఎస్ఎన్ఎల్ అధ్వర్యాన వేతన సవరణ కోరుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు మంగళవారం దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. ఇందులో భాగంగా చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ భవన్ వద్ద నిర్వహించిన ఆందోళనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓబులేశు మాట్లాడుతూ దేశప్రజల భాగస్వామ్యంతో ఉద్యోగులు కష్టపడి అభివృద్ధి చేసిన జాతి సంపద అయిన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. మతాలు, కులాల, ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఐక్య ఉద్యమాల ద్వారా మాత్రమే ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోగలమని, ఆ దిశగా చేపట్టే అన్ని పోరాటాలకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని చెప్పారు. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఆఫ్ బీఎస్ ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చైర్మన్ కె.అంజయ్య, కన్వీనర్ కె.రామాదేవి, ఇతర నాయకులు మాట్లాడుతూ... బీఎస్ఎన్ఎల్‌లో వీఆర్ఎస్ అమలు తర్వాత కేవలం 63వేల మంది మాత్రమే ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు మిగిలారని తెలిపారు. వారికి కూడా 2017 జనవరి ఒకటో తేదీ నుంచి వేతన సవరణ చేయాల్సి ఉన్నా, ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎ న్ఎల్ యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ దశల వారీగా పోరాటాలు సాగిస్తామని ప్రక టించారు. ఉద్యోగ సంఘాల నాయకులు డి.వేణుగోపాలరావు, జె.ఉమామహేశ్వరరావు, ప్రసాద్‌బాబు, ఎస్.బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన కలెక్టరేట్లు

● ఆరోగ్య బీమా కోసం కార్మికుల ధర్నాలు ● ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి
● ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మున్సిపల్ వర్కర్ల ఆరోగ్య బీమా విడుదల చేయాలని, సచివాలయాలకు కార్మికుల అక్రమ బదలాయింపు ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నిర్వహించిన ధర్నాలు విజయవంతమయ్యాయి. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట యూనియన్ నేతలు, కార్మికులు ధర్నాలకు తరలివచ్చారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వ్యవహరించకుండా సత్వరం మున్సిపల్ శాఖమంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, సీడీఎంఏ, యూనియన్లతో కూడిన సమావేశం నిర్వహించి, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్మికులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ గిరీశ్‌కు వినతిపత్రం అందచేశారు. భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ కరోనాతో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసుల రంగనాయకులు, ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి మాట్లాడుతూ కరోనా విపత్తులో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండు చేశారు. పల్నాడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో యూనియన్ నాయకులు రవికుమార్ మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఇతరత్రా ప్రయోజనాలను తక్షణమే ఇవ్వాలన్నారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి పులగం మద్దిలేటి మాట్లాడుతూ ఆస్తిపన్ను రద్దు చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో యూనియన్ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది విషయంలో జగన్ వాగ్దానాలు నీటి మూటలయ్యాయని ఎద్దేవా చేశారు. కాకినాడ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి చంద్ర దాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12 గంటల పనివిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్ గౌడ్ మాట్లాడుతూ డ్రైవర్లకు ఇంజినీరింగ్ సిబ్బందికి రూ.15 వేల వేతనం, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బాపట్ల కలెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటి దాస్ మాట్లాడుతూ కార్మికులకు పనిముట్ల కొరత తీర్చాలన్నారు. విజయనగరం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామేశ్ మాట్లాడుతూ కార్మికులకు బట్టలు, చెప్పులు, నూనె, సబ్బులు పెండింగ్ లేకుండా అందివ్వాలని, అవినీతి లేని వ్యవస్థను తీసుకురావాలని కోరారు. కడప కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర నాయకులు తారక రామారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు మున్సిపాలిటీలతోనే సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ల ఎదుట జరిగిన ధర్నాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరపాటి సత్యనారాయణ, శ్రీనివాసులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన, మరణించిన కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపుల్లోను, వారి పిల్లలకు తిరిగి పనులు కల్పించడంలోను ప్రభుత్వం అలసత్వాన్ని చూపుతోందన్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట జరిగిన ధర్నాలో చిక్కాల గోవింద్, నంద్యాల జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరిగిన ధర్నాలో రాష్ట్ర నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ధర్నాల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ వాసు, కోశాధికారి కె.మల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, వర సురేశ్ కుమార్, వెంకటేశ్వర్లు, కాసా రాంబాబు, దుర్గారావు, నాగరాజు, మునీర్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

"విశాలాంధ్ర దినపత్రిక వెలువడుతున్నదని తెలిసి ఆనందించనివాడె వడైనాఆ ఉంటాడా? ఒక నల్ల కళ్లజోళ్లున్న 'నతి మాల కాకి తప్ప!"

1952 జూన్ ఇరవై రెండున విశాలాంధ్ర వెలువడుతున్న సందర్భంలో సి. రాజగోపాలా చారి మీద శ్రీశ్రీ విసిరిన విసురు ఇది. ప్రారంభోత్సవ సభలో సంపాదకవర్గం తరపున మాట్లాడిన మద్దుకూరి చంద్రశేఖర రావు "ముక్కోటి ప్రజలను ఒక్క త్రాటిపై నడపడమే విశాలాంధ్ర పత్రిక ధ్యేయం" అన్నారు. ఏడు దశాబ్దాలుగా విశాలాంధ్ర ప్రజల వాణిని వినిపించడానికే నిబద్ధమై ఉంది. ఇక ముందు కూడా జనం తరపుననే నిలబడుతుంది. విశాలాంధ్ర సప్తతి జరుపుకోవడం చిరకాలం గుర్తుంచుకోదగిన సందర్భం. పెట్టుబడిదారుల, పరిశ్రమల అధిపతుల చేతిలో పడి నలిగిపోతున్న పత్రికా ప్రపంచం ఇవాళ తిరోగమన వాదుల, మతోన్మాదుల ముద్దు బిడ్డగా మారిపోయింది. ఎమర్జెన్సీలో పత్రికల మీద ఆంక్షలు విధించిన సందర్భంలో కూడా ఆ దురాగతాన్ని ఖండించి ఏటికి ఎదురీదిన పత్రికలు ఉన్నాయి. ఇప్పుడు పేరుకు ఎమర్జెన్సీ లేదు కానీ మోదీ ప్రభుత్వాన్ని నిలదీసే పత్రికా రచయితల మీద దేశద్రోహ కేసులు మోపి ఎన్ని అవాంతరాలు కల్పిస్తున్నారో చూస్తూనే ఉన్నాం. అయినా జనగళానికి అక్షర రూపం ఇవ్వడానికే విశాలాంధ్ర నిమగ్నమై ఉంది. ఇక ముందు కూడా ఉంటుంది. గత ఏడు దశాబ్దాలుగా తెలుగు జాతి జనుల జీవితంతో విశాలాంధ్ర ముడి వేసుకు ప్రయాణిస్తోంది. నిరపేక్షంగా జరుగుతున్న సంఘటనలను ప్రతిబింబించి, అవసరమైనప్పుడల్లా ప్రజలకు సైద్ధాంతిక సాధన సంపత్తి అందించి ప్రజాభిప్రాయాన్ని మలచడంలో విశాలాంధ్ర చేసిన కృషి అపూర్వమైంది. కేవలం తాజా సంఘటనలను రికార్డు చేయడంతో సరిపెట్టుకోకుండా ప్రజలకు దిశా నిర్దేశం చేయడంలో ఈ పత్రిక నిరంతరం పాటు పడుతూనే ఉంది. సమాజాభ్యుదయానికి అడ్డు తగిలే వ్యక్తుల, శక్తుల నిజస్వరూపాన్ని బయట పెట్టి ప్రజలను హెచ్చరించడం విశాలాంధ్ర తన బాధ్యతగా భావిస్తుంది. 1966లో విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని తెలుగు వారు నినదించినప్పుడు విశాలాంధ్ర అక్షరాయుధమై నిలిచింది. రక్తం చిందించి సాధించుకున్న విశాఖ ఉక్కును తెగనమ్మాలని మోదీ సర్కారు పన్నుతున్న కుట్రలకు వ్యతిరేకంగా 495 రోజులుగా ఆ కర్మాగార సిబ్బంది పోరాడుతున్న సమయంలోనూ వారి ఘోషను అనుదినం జనానికి వినిపిస్తున్నది విశాలాంధ్రే. కర్నూలులో రైతు యాత్ర, రాయలసీమలో కరువు సహాయం, బంజర్ల ఉద్యమం ఇలా ఏ ఉద్యమం జరిగినా మద్దతిచ్చి వెన్నుదన్నుగా నిలవడమే విశాలాంధ్ర లక్ష్యం. ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉంది. రాష్ట్ర విభజన హామీలను అమలు పరచడంలో మొండి చేయి చూపుతున్న వైనాన్ని విప్పి చెప్తోంది. రాజధాని లేకుండా కాలం గడుపుతూ అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను అటకెక్కించిన పాలకవర్గాల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా దీర్ఘకాలంగా కొనసాగుతున్న అమరావతి ఉద్యమానికి అండగా నిలుస్తున్నదీ విశాలాంధ్రే. ప్రజోద్యమాలే విశాలాంధ్ర ఊపిరి. విశాలాంధ్ర సగటు దిన పత్రిక కాదు. అదొక నిత్య చైతన్య స్రవంతి. పాలక పక్షాల తరపున వందిమాగధులుగా వ్యవహరిస్తున్న గోదీ మీడియా చేస్తున్న అట్టహాసం ప్రజలను పెడదోవ పట్టించడానికి ఎంత ప్రయత్నిస్తున్నా

అక్షరాయుధ కర్మాగారం విశాలాంధ్ర

నిజాయితీగా, నిర్భీతిగా ప్రజలకు నిజం చెప్పడానికి నానా యాతన పడుతున్న పత్రికలు, మీడియా సంస్థలు కొన్నైనా మిగిలే ఉన్నాయి. పాలక పక్షాలకు స్వచ్ఛందంగా ఊడిగం చేసే మీడియా వ్యవస్థలకు వనరులకు ఎటూ కొదవ ఉండదు. ఆ పత్రికలు పెట్టే మదుపుతో విశాలాంధ్ర లాంటి పత్రికలు పోటీ పడలేకపోవచ్చు. ప్రజల సమస్యలను వెలికి తెస్తూ, పాలకవర్గాల దుర్నీతిని ఎండగడుతూ కష్టనష్టాలకోర్చి నిలదొక్కుకుంటున్న మీడియా సంస్థలు కొన్నే కావచ్చు. వాటిలో విశాలాంధ్రది శిఖరాయమానమైన స్థానమే.

ప్రజల తరపున నిలబడే వ్యక్తులకైనా, వ్యవస్థలకైనా ఒత్తిళ్లు, దాడులు ఎదుర్కోక తప్పదు. అలాంటి దాడులను ఎదుర్కోవడంలో విశాలాంధ్ర రాటుదేలి పోయింది. ఆ దాడులు ఇదివరకూ ఉన్నాయి. 1955 ఉప ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ ఎక్కడ అధికారంలోకి వస్తోందోనని జడుసుకుని ఆ రోజుల్లో ఆంధ్ర ప్రభ, ఆంధ్ర పత్రిక కమ్యూనిస్టు పార్టీ మీద, విశాలాంధ్ర మీద దుమ్మెత్తి పోసి దొంగ దాడి చేశాయి. ఆ దాడిని ఎదుర్కోవడమే కాదు ఆ క్రమంలోనే తెలుగు పత్రికా లోకానికి రాజకీయ కార్టూన్లను, కార్టూన్ కవిత్వాన్ని పరిచయం చేసింది విశాలాంధ్రే. ఆ దాడిని ఎదుర్కోవడానికే అప్పుడు విశాలాంధ్రలో పని చేస్తున్న రాంభట్ల కృష్ణమూర్తి రాజకీయ కార్టూన్లకు ఒరవడి పెట్టి తెలుగులో తొలి రాజకీయ కార్టూనిస్టయ్యారు. శశవిషాణం పేర ఆయన కార్టూన్ కవితలు రాసి కొత్త ప్రక్రియను ప్రారంభించారు. విశాలాంధ్ర అక్షరాయుధ కర్మాగారమే కాదు తెలుగు పత్రికలకు తరవాత సంపాదకులైన కనీసం అరడజను మంది విశాలాంధ్ర ఉగ్గుపాలతో పత్రికా రచనలో అక్షరాభ్యాసం చేసిన వారే. జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ పత్రికా రంగాన్ని గమనిస్తే వామపక్ష భావజాలం ఉన్న వారు, సాహిత్యాభినివేశం ఉన్న వారే ఈ రంగంలో ఎక్కువగా రాణించినట్టు తేలుతుంది. ఈ రెండు అంశాలలోనూ ఒరవడి పెట్టింది నిస్సందేహంగా విశాలాంధ్రే. మద్దుకూరి చంద్రశేఖర రావు, రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి, రాచమల్లు రామచంద్రా రెడ్డి (రారా) ఏటుకూరి బలరామమూర్తి, తుమ్మల వెంకట్రామయ్య, మహీధర రామ మోహన్ రావు, అసలు ఈ పత్రికను మొదట ప్రారంభించిన సెట్టి ఈశ్వర రావు, సి. రాఘవాచారి వామపక్ష వాదులు మాత్రమే కాదు సాహిత్య, సైద్ధాంతిక రంగంలోనూ తమ పస నిరూపించుకున్నవారే. వారందరికీ ఉన్న సాహిత్యాభినివేశమే వారిని ఉత్తమ జర్నలిస్టులుగానే కాదు నికార్సైన మానవతా వాదులుగా మలచడానికి విశాలాంధ్ర చేయూత నిచ్చింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారిని రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్న దశలో కొనసాగిన ఆంధ్రోద్యమ నేపథ్యమే, తెలుగు వారందరూ ఒకే ప్రాంతంగా కలిసి ఉండాలని మొట్టమొదట ఎలుగెత్తి చాటింది, విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న నినాదం ఇచ్చింది కమ్యూనిస్టు పార్టీ. ఆ చరిత్రే అదే పేరుతో విశాలాంధ్ర పత్రికకు రూపం ఇచ్చింది. 1953లో ఆంధ్ర రాష్ట్ర అవతరణతో తెలుగు వారందరూ ఒకే రాష్ట్రంలో ఉండడానికి వీలు లేకపోయింది. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా 1948లో ప్రస్తుతం తెలంగాణ అంటున్న ప్రాంతానికి నిజాం పీడ విరగడైనా తెలుగు వారందరూ ఒకే జెండా కిందకు రావడం 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించే దాకా కుదరనే లేదు. తెలుగువారందరూ ఒకే రాష్ట్రంగా ఉండాలన్న కమ్యూనిస్టు పార్టీ సంకల్ప బలమే విశాలాంధ్ర అన్న భావనకు బీజం వేసింది. తెలుగు వారు అనేక సార్లు కలిసి ఉన్నారు. అనేక సార్లు విడిపోయారు. అయినా తెలుగు జాతి చిరసంచిత వాస్తవికతా నిధినిక్షేపాలను పరిరక్షించాలన్న భావనకు ఇప్పటికీ విశాలాంధ్ర కట్టుబడి ఉంది. పత్రికా రంగాన్ని పాలక పక్షాలకు తాకట్టు పెట్టిన ఈ తరుణంలో ప్రత్యామ్నాయ పత్రికా రచనకు విశాలాంధ్ర నిబద్ధమై ఉంటుంది.

ప్రజలపై ద్రవ్యోల్బణం పడగ

రావుశ్రీ

ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న శత్రువు లాగ, దేశంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధిక ధరలు పగ తీర్చుకుంటున్నాయి. టోకు ధరల సూచీ (డబ్ల్యు.పి.ఐ) 13.11%, వినియోగదారుల ధరల సూచీ (సి.పి.ఐ) 6.07% శాతంగా కొనసాగుతోంది. గత రెండు దశాబ్దాలుగా గ్లోబలైజేషన్ ప్రభావంతో చాలా దేశాలు దిగుమతులుపై ఆధారపడి ఉంటున్నాయి. చాలా వస్తువులు స్వశక్తితో తయారు చేయగలం. అయినా, దిగుమతులుపై ఆధారపడుతున్నాం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం ద్రవ్యోల్బణం ధరలపై ఉంది. పెట్రోల్ డీసెల్ ధరలు పెరగడం. ఆ దేశాల నుంచి వచ్చే సన్ ఫ్లవర్ ఆయిల్, స్టీల్, బార్లీ, గోధుమ అనేక వస్తువులు సరఫరా లేకపోవడంతో ప్రపంచ దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. దీనికి భారతదేశం కూడా అతీతం కాదు. అనేక వస్తువులు ధరలు పెరిగి మనదేశంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపు తోంది. వీరి సంపాదనలో అధిక భాగం పెట్రోల్, డీసెల్, మంచినూనె, ఇతర ఆహార పదార్థాలు కొనడానికే సరిపోతుంది. ఆహార ధాన్యాలు టోకు సూచీ 8.5%, వినియోగదారులు ధరల సూచీ 5.9%గా ఉన్నట్లు తెలు స్తోంది. "లోన్ యాప్" లో చిక్కుకున్న కుటుంబ సభ్యులు అనేకులు ఉన్నారు. మన ఇంట్లో కూడా వంట చేసుకునే అవకాశం ఉన్నా, కర్రీ పాయింట్, ఫాస్ట్ ఫుడ్స్, రెస్టారెంట్లకు అలవాటు పడుతున్నాం. ఈ పరిస్థితి చూస్తూంటే, భవిష్యత్తులో వంటగది నిర్మాణం అవసరం ఉండదేమో అనిపిస్తోంది. ఇక స్వావలంబన దిశగా అడుగులు పడేదెప్పుడు?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్నా, అస మానతలు మనలను వెంటాడుతున్నాయి. ఆర్థిక అసమానతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నేటికీ దేశంలో కేవలం 10%

శాతం జనాభా సంవత్సరం ఆదాయం 3 లక్షల లోపు ఉంది. ఇంకా మిగిలిన వారి పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ఇక సామాన్య మధ్యతరగతి 50% జనాభాలో కేవలం 22% మంది మాత్రమే వేతన జీవులు. ఏప్రిల్ 2022 క్రిసల్ (సి.ఆర్.ఐ. యస్.ఐ.ఎల్) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం వేతన పెరుగుదల 5.7 గా ఉండగా, అదే సమయంలో ద్రవ్యోల్బణం రేటు 6.4% శాతం నమోదు అవుతుండగా ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ అయి సామాన్య మధ్య తరగతి ప్రజలు జీవితాలు దుర్భరం చేస్తున్నాయి. ఇక మన దేశంలో ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి ప్రపంచంలో చాలా దేశాలు కంటే తక్కువ నిధులు ఖర్చు చేస్తున్నాయి. అందువల్ల చాలామంది తమ ఆదాయంలో ఎక్కువ భాగం వైద్య ఖర్చులకు, ప్రైవేటు ఆసుపత్రులకు ధారపోసి బతుకులు బుగ్గి చేసుకుంటు న్నారు. తాజా ఉదాహరణ కరోనా కాలంలో చూసాం. కోవిడ్ మరణాలు లక్షల సంఖ్యలో నమోదు అయ్యాయి. వీరిలో చాలామంది తమ ఆస్తులను, ఆదాయాన్ని కోవిడ్ చికిత్స కోసం ఖర్చు చేశారు. ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీ వల్ల అనేకమంది బతుకులు చిందరవందర అయ్యాయి.

ఇక ప్రభుత్వాలు రకరకాల పన్నులు, సెస్‌ల రూపంలో బాదుడే బాదుడు. సామాన్య ప్రజల నడ్డి విరిచే పని. ఒక పక్క సంక్షేమ పథకాలు ఇస్తూ, మరొక పక్క అనేక పన్నులు భారాలు వేసి అధిక ఆదాయం సమ కూర్చుకుంటున్నారు. కార్పొరేట్లకు పన్నులు 15% శాతం ఉండగా, అదే వేతన జీవులు తమ ఆదాయంపై 30% పన్ను కడుతూ కుదేలు అవు తున్నారు. అసంబద్ధమైన పన్నులు విధానం. ధనవంతులు మరింత ధన వంతులు కావడం. పేదవారు మరింత పేదలుగా మారుతున్నారు. ఇక నైనా పన్నుల విధానం మారాలి. బడా పారిశ్రామికవేత్తలకు, సంస్థలకు ఇచ్చే రాయితీలు ప్రోత్సాహకాలు తగ్గించాలి. భారత్ ప్రజలపై ద్రవ్యో ల్బణం పడగ విప్పి నాట్యం చేస్తూ, ప్రజల జీవితాలు "పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు" చేస్తోంది అనుటలో అతిశయోక్తి లేదు.

విశాలాంధ్ర నాడు-నేడు

ప్రముఖ కమ్యూనిస్టు మేధావి ఈడ్పుగంటి నాగేశ్వరరావు విశాలాంధ్ర ఎడిటర్‌గా సి.రాఘవాచారి అనంతరం బాధ్యతలు చేపట్టారు. 12 ఏళ్లకుపైగా విశాలాంధ్ర ఎడిటర్‌గా, ఇంకొంతకాలంపాటు ఎడిటోరియల్ బోర్డు చైర్మన్‌గా వ్యవహరించారు. కమ్యూనిజం సిద్ధాంతాన్ని సొంతం పుణికిపుచ్చుకున్న ఈడ్పు గంటి నాగేశ్వరరావుకి సైద్ధాంతిక అంశాలతోపాటు అంతర్జాతీయ విషయాలపై అపారమైన పరిజ్ఞానం వుంది. విశాలాంధ్ర పత్రికలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఆయన నేటి ప్రముఖ పత్రికలకు ధీటుగా విశాలాంధ్రను నిలపడంలో అద్వితీయ కృషి చేశారు. ఈ పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టుల్లో ఎంతోమందికి సైద్ధాంతిక విషయాలు బోధించి, వారిలో కమ్యూనిస్టు నిబద్ధతను పెంచడంలో ఆయన కృషి గొప్పది. పత్రిక స్వర్ణోత్సవ (50 ఏళ్లు) సమయానికి సంపాదకులు ఆయనే. విశాలాంధ్ర జాతీయ దినపత్రిక 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈడ్పుగంటి నాగేశ్వరరావు అనేక విషయాలపై విశా లాంధ్రతో ముచ్చటించారు. ప్రధానమైన రెండు అంశాలపై ఆయన అభిప్రాయాలను ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నాం...

ఈడ్పుగంటి నాగేశ్వరరావు
పూర్వసంపాదకులు

ప్రశ్న : విశాలాంధ్ర ఏర్పడి 70 సంవత్సరాలైంది. నాటి నేపథ్యం ఏమిటి ? తొలిదశలో విశాలాంధ్ర నిర్వహించిన పాత్ర ఏమిటి ?

ఈడ్పుగంటి : 1951లో భారత కమ్యూనిస్టుపార్టీ అజ్ఞాతవాసం నుంచి బయటకు వచ్చింది. సాధారణ ఎన్నికల్లో పాల్గొనేందుకు సంసిద్ధమైంది. 1952 ప్రారంభంలో జరిగిన ఆ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ ఆంధ్ర ప్రాంతంలో పెద్ద పార్టీగా 41 స్థానాలు గెల్చుకుంది. కాంగ్రెస్ పార్టీకి 40 స్థానాలు వచ్చాయి. ఆ ఎన్నిక ప్రచారంలో పెట్టిన ప్రధాన నినాదం ఆంధ్ర రాష్ట్ర సాధన. కాంగ్రెస్ పార్టీ భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజనకు అంగీకరించినా అమలు జరపలేదు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ, మద్రాసు ప్రెసిడెన్సీలోనూ అధికారంలో ఉంది. మద్రాసు అసెంబ్లీ లోపలా, బయటా ఆంధ్ర ప్రాంతంలోని కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర రాష్ట్ర సాధనకు గొప్ప ఉద్యమాన్ని నడిపింది. పొట్టి శ్రీరాములు బలిదానంతో కేంద్ర ప్రభుత్వం అంగీకరించి 1953లో అక్టోబరు 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేసింది. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ సాగించిన ఈ ఉద్యమాన్ని విశాలాంధ్ర దినపత్రిక విస్తృత ప్రచారంలో పెట్టి ప్రజానీకాన్ని చైతన్యపర్చింది. విశాలాంధ్ర పత్రిక 1952 జూన్ 22వ తేదీన ఏర్పడడంలో, దాని స్థాపనలో, నిర్వహణలో చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, తెలంగాణ కామ్రేడ్స్, అన్ని స్థాయిలలో పార్టీ కార్యకర్తలు గొప్పగా స్పందించి దానిని ప్రారంభించారు. మద్దుకూరి చంద్రశేఖరరావు, మోటూరు హనుమంతరావు తొలిదశలో సంపాదక వర్గానికి వివిధ దశలలో నాయకత్వం వహించారు. కమ్యూనిస్టు ఉద్యమానికి విశాలాంధ్ర పత్రిక గొప్ప ఆలంబన. ఆంధ్ర రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, నందికొండ, సిద్ధేశ్వరం, ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి, ఉద్యమ రూపం దాల్చడానికి విశాలాంధ్ర పత్రిక గొప్పగా దోహదం చేసింది. రాజధాని కర్నూలు రైతు కూలీ యాత్ర, రాయలసీమలో కరవు సహాయం, బంజర్ల ఉద్యమం వంటి అనేక ప్రజా ఉద్యమాలకు విశాలాంధ్ర ఒక ప్రచార సాధనంగా ఉపయోగపడింది. ఆనాడు కాంగ్రెస్ పార్టీ, కృషి కార్‌లోక్ పార్టీ, ప్రజా పార్టీ, సోషలిస్టులు, ఇంకా తదితర శక్తులు రాజకీయ రంగంలో ఉన్నప్పటికీ, కమ్యూనిస్టుపార్టీ నికరంగా రాష్ట్ర సాధనకు, విజయవాడ రాజధాని ఏర్పాటుకు పోరాడింది. ప్రజా సమస్యలను విశాలాంధ్ర పత్రిక ప్రతిబింబించింది.

జాతీయ రాజకీయాల్లో కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఎన్నికైంది. ఏకే గోపాలన్, హిరేన్ ముఖర్జీ, పుచ్చలపల్లి సుంద రయ్య, భూపేష్ గుప్తా తదితరులు పార్లమెంటులో ప్రజావాణిని సమర్థవంతంగా వినిపించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో, ప్రాజెక్టుల నిర్మాణంలో వారి పాత్ర గుర్తించదగినది. అంతర్జాతీయంగా సోవియట్ యూనియన్ సాధిస్తున్న ప్రణాళికబద్ధ విజయాలను, చైనాలో సోషలిస్టు విప్లవాత్మక సంస్కరణలను, తూర్పు యూరప్‌లో కమ్యూనిస్టు పాలన తీసుకొస్తున్న సంస్కరణలను విశాలాంధ్ర పత్రిక విశ్లేషణాత్మక వ్యాసాలతో ప్రజల దృష్టికి తీసుకొచ్చింది. సోషలిస్టు భావాలను ప్రచారం చేసింది.

1955 ఆంధ్రప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక కమ్యూనిస్టు వ్యతిరేక విద్వేష ప్రచారాన్ని భయంకరంగా సాగించాయి. విశాలాంధ్ర పత్రిక ఆ విషపు దాడిని తట్టుకోవటంలోనూ, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను ఉత్సాహపర్చడంలోనూ గొప్ప పాత్ర నిర్వహించింది. ముఖ్యంగా 'కంచు కాగడా, తీరు- తెన్నులు' వంటి శీర్షికలు నిర్వహించి చంద్రం, మోటూరు హనుమంతరావు పాఠకులను ఉత్తేజపరిచేవారు. రాంభట్ల కృష్ణమూర్తి కార్టూన్లు, గేయాలు విశాలాంధ్రకు వన్నె తీసుకొచ్చాయి. ఆనాడు విజయవాడ నుంచి విశాలాంధ్ర పత్రిక వెలువడడం, ఆ రోజుల్లో ఉదయం, సాయంత్రం ఎడిషన్లు ప్రచురించడంతో ప్రజల్లో మంచి ప్రాచుర్యం పొందింది. 1957 ఎన్నికల్లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ గొప్ప విజయాన్ని సాధించి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. ఆ ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యవసాయ, విద్య తదితర సంస్కరణలను విశాలాంధ్ర పలు రూపాల్లో, ప్రజల్లో సానుభూతిని పెంపొందించడంలోనూ చురుకైన పాత్ర నిర్వహించింది. నంబూద్రిపాద్ జాతీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజా సాంస్కృతిక, సాహిత్య రంగాలకు ఊతం ఇచ్చింది విశాలాంధ్ర. కళాకారులను వెలుగులోకి తీసుకొచ్చింది.

ప్రశ్న : నేటి పరిస్థితుల్లో విశాలాంధ్ర పాత్ర ఏమిటి ?

ఈడ్పుగంటి : కొత్తగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడినా రాజధాని లేకపోవడంతో ప్రజల్లో గందరగోళం, నిరాశ, నిస్పృహలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నది. ప్రాంతీయ పార్టీలు అస్పష్ట రాజకీయ వైఖరులు తీసుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, జనసేన పార్టీల్లో నికరమైన స్పష్టమైన అవగాహన లోపించింది. రాష్ట్ర విభజన హామీలు అమలుపరిచే దిక్కు లేకుండా పోయింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రజలకు ద్రోహం చేసింది. సామాజిక వైరుధ్యాలు పెరుగుతున్నాయి. అన్నివర్గాల్లోనూ తీవ్ర అలజడి, ఆందోళన నెలకొన్నాయి.

మరొకవైపు మోదీ ప్రభుత్వం నయా ఉదారవాదంతో సంపన్నవర్గాలకు ప్రయోజనం కల్పించి అత్యధిక ప్రజానీకానికి తీవ్ర హాని కల్గిస్తున్నది. మతతత్వ ధోరణులు, హిందూత్వ భావజాలం పెచ్చరిల్లాయి. ప్రధాన తెలుగు వార్తా దిన పత్రికల్లో రాజకీయంగా స్పష్టమైన చీలిక ఏర్పడింది. కొన్ని పత్రికలు వైఎస్సార్ పార్టీకి, మరికొన్ని తెలుగుదేశం పార్టీకి ప్రచార సాధనాలుగా మారాయి. వామ పక్ష ఉద్యమం ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమం దేశంలోనూ, రాష్ట్రంలోనూ బలహీనపడిన పరిస్థితుల్లో విశాలాంధ్ర లాంటి వామపక్ష పత్రిక నిలదొక్కుకోవడం ఒక విశేషం. ముఖ్యంగా ఆ పత్రిక భావజాల రంగంలో హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా సెక్యులరిజం కోసం రాజీలేని పోరాటం సాగించడంలో దాని పాత్ర విలువైనది. ఏ ఇతర రాజకీయ బూర్జువాపార్టీకి ఈ పత్రిక తోకగా, ప్రచార సాధనంగా వ్యవహరించడం లేదు. దీనికి కారణం సైద్ధాంతిక నిబద్ధత, విశాలాంధ్ర జర్నలిస్టుల అంకితభావం. తెలుగునాట కమ్యూనిస్టు జర్నలిజం కొత్త బాణీలను ప్రవేశపెట్టింది. ప్రామాణిక భాష అభివృద్ధిలో, ప్రజా సంస్కృతిని ప్రోత్సహించడంలో, రాష్ట్ర సమతుల్యాభివృద్ధిని సాధించే ఆశయంతో ఈ పత్రిక విశిష్టమైన పాత్ర నిర్వహిస్తోంది.

ఇంటర్వ్యూ : చావా రవి

ఐ-మెయిల్

అమాత్యులూ... ప్రభుత్వాసుపత్రులు మీకెందుకు పనికిరావూ?

నేటి కార్పొరేట్ యుగంలో సాధారణ, సామాన్య ప్రజలకు ప్రైవేట్ వైద్యం అత్యంత ఖరీదయిపోయింది. ప్రజలకు ప్రభుత్వాసు పత్రులే దిక్కు. మన రాష్ట్రంలో ప్రభుత్వాలు ప్రభుత్వాసుపత్రులను ఎంతో అభివృద్ధి చేసా మని, ఎన్నెన్నో సౌకర్యాలు కల్పించామని గొప్పగా ప్రచారం చేసాయి, చేస్తున్నాయి. అటువంటి ప్రభుత్వాసు పత్రులు - మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారుల వైద్యానికి పనికిరాక పోవటం విచిత్రం. ఎన్నో సౌకర్యాలున్న ప్రభుత్వ వైద్యశాలలు వీళ్ళ వైద్యానికి ఎందుకు పనికి రావటం లేదు ? అంటే ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అసత్యమా? వైద్యం పేరుతో వీళ్ళు అపోలో, యశోద, కామినేని వంటి కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం చేయించుకుంటున్నారు. అది వాళ్ళ సొంత ఖర్చుతో అయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, రాష్ట్ర ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తున్న విలువైన ప్రజాధనంతో చేయించుకోవడం దుర్మార్గం. ఈ దుర్మార్గాన్ని రాజకీయ పార్టీలకతీతంగా అధికారంలో కొచ్చిన వాళ్ళందరూ అనుసరిస్తున్నారు. కనుక విలువైన ప్రజాధనాన్ని కాపాడటం కోసం, ప్రజా సంక్షేమానికి ఖర్చు చెయ్యటం కోసమే వినియోగించాలి. ఇందుకు ఏ ప్రభుత్వ మంత్రులయినా, ప్రజాప్రతినిధులయినా, ఉన్నతాధికారులయినా కేవలం ప్రభుత్వాసుపత్రులలో మాత్రమే వైద్యం చేయించుకొనేలా, ఒకవేళ కార్పొరేట్ - ప్రైవేట్ వైద్యశాలలకు వెళితే వాళ్ళ సొంత ఖర్చుతోనే వైద్యం చేయించుకొనేలా చట్టం చెయ్యాలి. తద్వారా విలువైన ప్రజాధనాన్ని కాపాడాలని మనవి.

వీరుభొట్ల పేరయ్యశాస్త్రి. విజయవాడ.

ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక

విశాలాంధ్ర దినపత్రిక 1952లో ఆవిర్భావం తర్వాత ప్రజల సామాజిక జీవనంలో అనేక సందర్భాలలో చారిత్రక పాత్ర నిర్వహించింది. అది రాజకీయంగా, సాంఘికంగా, సాహిత్యపరంగా కూడా.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నా గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే నాటి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తమ్మారెడ్డి సత్యనారాయణ మా గ్రామం నుండి ఒక ఉత్తరం ద్వారా నన్ను హైదరాబాదు పిలిపించి పార్టీలో పని చేయడానికి నా ముందు రెండు ప్రతిపాదనలు ఉంచారు. అందులో ఒకటి విశాలాంధ్ర హైదరాబాద్ బ్యూరోలో విలేకరిగా పనిచేయడం. అప్పటికే హైదరాబాద్‌లో చీఫ్ రిపోర్టర్‌గా కామ్రేడ్ మక్కెన సుబ్బారావు పని చేస్తున్నారు. ఇది బహుశా 1972 ఆఖరిలో అనుకుంటా... హైదరాబాద్ బ్యూరోలో ట్రైనీ విలేకరిగా విశాలాంధ్రలో వృత్తి జీవితం ప్రారంభమైంది. దానికి ముందు కామ్రేడ్ తమ్మారెడ్డితో పాటు కామ్రేడ్ కందిమళ్ల ప్రతాపరెడ్డి, కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి, కామ్రేడ్ వై.వి.కృష్ణారావులు పార్టీ నిర్మాణ రంగంలో నన్ను ఇమడ్చడానికి యోచన చేశారు.

నా నాలుగు దశాబ్దాలకు పైగా అనుబంధంలో విశాలాంధ్ర పోషించిన అద్వితీయ పాత్రను, ఎదుర్కొన్న తీవ్రమైన ఒడిదొడుకులను నేను ప్రత్యక్షంగా ఎరుగుదును. విశాలాంధ్ర ఆవిర్భావమే ఆనాటి జర్నలిజానికి ఒక ప్రత్యామ్నాయ దీపిక. స్వాతంత్ర్యా నంతరం దేశంలో ఏర్పడిన పాలకులకు, పాలక పార్టీలకు ప్రధాన పత్రికలన్నీ సాను కూలంగా వ్యవహరించడం, తెలుగునాట కమ్యూనిస్టు వ్యతిరేకతను నెత్తికెక్కించు కోవడం... పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థ స్థానే నూతన సామ్యవాద సిద్ధాంత విస్తృత ప్రచారానికి ఒక పత్రిక అవసరమే 'విశాలాంధ్ర' ఆవిర్భావానికి మూల కారణం. స్వాతంత్ర్యోద్యమంలో ఒక మిషన్‌గా పనిచేసిన పత్రికా వ్యవస్థ స్వాతంత్ర్యా నంతరం ఒక పరిశ్రమగా మారిపోవడం ఈ మార్పుకు ప్రధాన కారణం.

విశాలాంధ్ర తన సుదీర్ఘ పయనంలో 70 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భంగా విశాలాంధ్ర స్వర్ణోత్సవ (50) సభ గుర్తుకు వస్తోంది. హైదరాబాద్‌లో విశాలమైన పబ్లిక్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించిన నాటి ఉత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎ.బి. బర్ధన్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులుగా నాడు పువ్వాడ నాగేశ్వరరావు, విశాలాంధ్ర సంపాదకులుగా ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఉన్నారు.

విశాలాంధ్ర దినపత్రిక ప్రజావాణిగా, ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీకగా నాటికీ, నేటికీ నిరాటంకంగా కొనసాగటమేకాదు - పాలకుల కంటగింపునకు ఏదో ఒకరీతిలో గురవుతూనే ఉంది. మొదటి నుంచి చివరి వరకు హైదరాబాద్ కేంద్రంగా విశాలాంధ్రలో పనిచేసిన నాకు చాలా అనుభవాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కొన్నింటిని ప్రస్తావించ దల్చాను...

కలిమెకొలన్ శ్రీనివాస్‌రెడ్డి

ఎమర్జెన్సీ పాలన నాటి ఒక సంఘటనను గుర్తు చేయాలి. నాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా జలగం వెంగళ రావు కొనసాగుతున్నారు. ఎమర్జెన్సీ అరాచకాలలో బల వంతపు కుటుంబ నియంత్రణ ఒకటి. దానికి నాటి ప్రధాని ఇందిరాగాంధీ రెండవ కుమారుడు సంజయ్ గాంధీ మూల పురుషుడు. ఒక రోజు విశాలాంధ్ర మొదటి పేజీలో, కొత్తగూడెంలో 18 ఏళ్ల యువకునికి బలవంతంగా వైద్యాధికారులు కుటుంబ నియంత్రణ చేసిన సంఘటనను ప్రచురించింది.

ప్రతిరోజు ఏదో ఒక సమయంలో సచివాలయ బీట్ విలేకరుల బృందం వార్తా సేకరణలో భాగంగా ముఖ్య మంత్రిని కలవడం రివాజు. ఆ రోజు ముఖ్యమంత్రిని ఉదయం 10:30 గం॥ల ప్రాంతంలో ఆయన ఛాంబర్ లోనే కలిసి విశాలాంధ్ర మొదటి పేజీ వార్తను ముఖ్యమంత్రి వెంగళరావు దృష్టికి తీసుకువచ్చారు. వెంగళరావు ఆగ్రహోదగ్రుడై అసత్యాలు రాసిన ఆ పత్రికను నలిపి వేస్తానని తన అరికాలిని నేలకు రాసాడని ఆనాడు కొద్ది ఆలస్యంగా సచివాలయ ప్రెస్ రూమ్‌కు చేరగానే నాకు సహచర విలేకరులంతా సంఘటనను వివరించారు. ఈ వార్తను యథాతథంగా ప్రకటించడంతోపాటు కొత్తగూడెం యువకుని ఫోటోను, పేరును, కుటుంబ వివరా లను విశాలాంధ్ర తెల్లవారి మళ్లీ మొదటి పేజీలో ప్రచురించింది. అంతే కాదు... విశాలాంధ్ర తన ఆవిర్భావంలో ఇప్పటి వరకు అనేకమంది ముఖ్యమంత్రులను చూసింది. అందులో వెంగళరావు మొదలు కాదు, ఆఖరూ కాదు... అంటూ ఘాటైన సంపాదకీయం రాసింది. తెల్లవారి పేపర్ చూడగానే వెంగళరావు నాటి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తమ్మారెడ్డికి ఫోన్ చేసి విచారం వ్యక్తం చేశారు. తననిక వదిలివేయమని కోరారు. అవాస్తవాలకు, వక్రీకరణలకు ఏనాడూ విశాలాంధ్ర పాల్పడలేదు. నిజానికి తెలుగు జర్నలిజంలో వృత్తిపరమైన ఒక తరాన్ని అందించిన ఘనత విశాలాంధ్రకే దక్కుతుంది.

శాసనసభలో సి.వి.కె.రావు సీనియర్ సభ్యులు. కాకినాడ నుండి మద్రాసు శాసనసభకు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. ఐ.సి.ఎస్. చదివిన వ్యక్తి. కమ్యూనిస్టు పార్టీతో ఉండే వారు. ఆ తర్వాత స్వతంత్రులుగా ఎన్నికయ్యారు. ఒక రోజు సాయంకాలం శాసనసభలో మాట్లాడుతూ "గుర జాడ అప్పారావు బ్రిటిష్ ఏజెంట్" అని వ్యాఖ్యానించారు. నాడు సీపీఐ పక్ష నాయకులుగా వేములపల్లి శ్రీకృష్ణ ఉన్నారు. ఆరోజు శుక్రవారం కావటం, శని, ఆదివారాలు సభకు సెలవైనందున సభ్యులంతా వారివారి నియోజక వర్గాలకు వెళ్లి తిరిగి సోమవారం సభకు రావటం ఆన వాయితి. సి.వి.కె.రావు హైదరాబాద్ నుండి కాకినాడ చేరగానే పార్టీ కార్యకర్తలు నల్లజెండాలతో సి.వి.కె. రావుకు స్వాగతం పలికారు. ఆయన చాలా ఆవేశానికి గురయ్యారు. గురజాడపై శాసనసభలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై విశాలాంధ్ర మరునాడు సంపాద కీయం రాసింది. అందులో... దాని హెడ్డింగు ఏమి టంటే... "చరిత్ర జ్ఞానశూన్యులు...". దానిపై శాసన సభలో సి.వి.కె.రావు సభా హక్కుల తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సభలో తీవ్రమైన చర్చ జరిగింది. నాటి స్పీకర్ పిడతల రంగారెడ్డి తీర్మానాన్ని తోసిపుచ్చారు.

దేశ రాజకీయ చిత్రపటంలో ఊహించనిరీతిలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్న ఈ తరుణంలో 'విశాలాంధ్ర' లాంటి పత్రికలు మరెన్నో అవసరం. ప్రజల పక్షాన నిలబడే పత్రికల మనుగడ కష్టతరమే. తిరోగమన విధానాలకు వంత పాడుతున్న బడా పత్రికలు లేదా టీవీల తీరుతెన్నులు సమాజ మార్పును కోరేవారికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

'విశాలాంధ్ర' 70 ఏళ్ల చరిత్ర గమనంలో అన్నింటినీ ఎదుర్కొంటూ ముందడుగులు వేస్తూనే ఉంది. నూతన సాధన సంపత్తి, సాధనాలు, నూతన ఆలోచనా విధానాలతో పురోగమన రాజకీయ విధానాలకు, సిద్ధాంతాలకు 'విశాలాంధ్ర' అండనిస్తూ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను.

వ్యాస రచయిత విశాలాంధ్ర పూర్వ సంపాదకులు,
ప్రజాపక్షం సంపాదకులు,
ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు.

యోగా జీవన విధానంగా మారుతోంది

ప్రధాని మోదీ

మైసూర్: యోగా ఇకపై జీవితంలో భాగం కాదని.. అది ఒక జీవన విధానంగా మారుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్ణాటకలోని మైసూరులో యోగా వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. మైసూర్ ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్నవారితో కలిసి మోదీ యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు కేంద్రం మంత్రి సర్బానంద సోనోవాల్, కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. యోగా అనేది సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుంది. అంతర్గత శాంతిని కలిగిస్తుందని అన్నారు. 'యోగా నుంచి శాంతి కేవలం వ్యక్తులకు కాదు. యోగా మన సమాజానికి శాంతిని కలిగిస్తుంది. యోగా మన దేశాలకు, ప్రపంచానికి శాంతిని తెస్తుంది. అంతేకాకుండా యోగా మన విశ్వానికి శాంతిని కలిగిస్తుంది' అని ఆయన అన్నారు. 'మనం ఎంత ఒత్తిడితో కూడిన వాతావరణంలో ఉన్నప్పటికీ... కొన్ని నిమిషాల పాటు చేసే ధ్యానం మనల్ని ఉపశమింపచేస్తుంది... మన ఉత్పాదకతను పెంచుతుంది. కాబట్టి మనం యోగాను అదనపు పనిగా పరిగణించ కూడదు. మనం యోగా గురించి తెలుసుకోవాలి... యోగాతో జీవించాలి... దానిని మన సొంతం చేసుకోవాలి' అని ప్రధాని మోదీ పిలుపు నిచ్చారు. యోగా ఇప్పుడు జీవితంలో ఒక భాగం కాదు.. కానీ అది ఒక జీవన విధానంగా మారుతోందని పేర్కొన్నారు. 'ఈ విశ్వం మొత్తం మన సొంత శరీరం, ఆత్మ నుంచి మొదలవుతుంది. విశ్వం మన నుంచి మొదలవుతుంది. యోగా మనలోని ప్రతిదాని గురించి మనకు స్పృహ కలిగిస్తుంది. అలాగే అవగాహనను పెంపొందిస్తుంది' అని మోదీ అన్నారు. యోగాను గుర్తించిన ఐక్యరాజ్య సమితి సహా ప్రపంచదేశాలకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. కొన్నేళ్ల క్రితం ఇళ్లు, ఆధ్యాత్మిక కేంద్రాల్లోనే యోగా కనిపించేదని, ప్రస్తుతం ప్రపంచ నలుమూలలా విస్తరించిందని ఆయన అన్నారు. 2015 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ ఏడు యోగా దినోత్సవ ఇతివృత్తం 'మానవత్వం కోసం యోగా'. 75 మంది కేంద్ర మంత్రులు దేశంలోని 75 చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాల్లో జరిగిన యోగా వేడుకల్లో పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌లో...

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి భవన్‌లో యోగా సాధన చేశారు. యోగాను భారతదేశం మానవాళికి అందించిన బహుమతిగా ఆయన అభివర్ణించారు. ఇది మానవాళి ఆరోగ్యం, శ్రేయస్సుకు సంపూర్ణమైన విధానం... మన మనస్సు, శరీరం, ఆత్మను సమతుల్యం చేస్తుంది. జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను' అని కోవింద్ ట్వీట్ చేశారు.

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. యోగా అంటే సాధన చేయడం, ఏకాగ్రత సాధించడం అని పేర్కొన్నారు వెంకయ్య నాయుడు. యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, కులమతాలకు అతీతమని అన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' వద్ద యోగా వేడుకల్లో పాల్గొ న్నారు. దిల్లీ త్యాగరాజ స్టేడియంలో జరిగిన యోగా కార్యక్రమంలో దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఉత్తర ప్రదేశ్ నోయిడాలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపి నడ్డా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి రుషికేష్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశ రాజధానిలోని ఐకానిక్ జంతర్ మంతర్‌లో జరిగిన యోగా సెషన్‌లో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్, రాజస్థాన్‌లలో వరుసగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, గవర్నర్ కలరాజ్ మిశ్రా యోగా వేడుకలకు నాయకత్వం వహించారు.

ప్రపంచదేశాల్లో...

లండన్‌లోని భారత రాయబార కార్యాలయం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. మంగళవారం స్వామినారాయణ్ మందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంతో వారం రోజుల అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ముగింపు పలికింది. అదేవిధంగా, బ్రిటిష్ అంతటా గల భారతీయ కాన్సులేట్లు బహిరంగ యోగా కార్యక్రమాలను నిర్వహించాయి. చైనా రాజధాని బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం యోగా సెషన్‌ను ఏర్పాటు చేసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూయార్క్‌లోని కాన్సు లేట్ జనరల్ ఆఫ్ ఇండియా అనేక యోగా కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందులో టైమ్స్ స్క్వేర్‌లో జరిగే భారీ స్మారకోత్సవం కూడా ఉంది.

కిడ్నీ బాధితుడి మృతి కేసులో

వైద్యుల సస్పెన్షన్ సబబే

కేరళ ఆరోగ్యమంత్రి వీణా జార్జి

తిరువనంతపురం: కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఆలస్యం కావడంతో బాధితుడు మృతి చెందిన ఘటనలో తిరువనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన ఇద్దరు డాక్టర్లపై విధించిన సస్పెన్షన్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జి సమర్థించారు. ఘటనపై విచారణకు ఆదేశించిన క్రమంలో దర్యాప్తును వేగవతం చేసే దిశలోనే వైద్యులను సస్పెండు చేసినట్టు తెలిపారు. సస్పెన్షన్ అంటే ఉద్యోగం నుంచి తొలగించడం కాదని పేర్కొన్నారు. వైద్యులను సస్పెండు చేయడాన్ని వ్యతిరేకించిన డాక్టర్ల యూనియన్ నిరసన చేపట్టిన క్రమంలో ఆమె ఈ మేరకు స్పందించారు. తిరువనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధి బాధితుడికి ఎర్నాకులంలో బ్రెయిన్ డెడ్ అయిన 34 ఏళ్ల వ్యక్తి కిడ్నీని అమర్చాలని నిర్ణయించిన వైద్యులు ఆదివారం ఆ వ్యక్తి కిడ్నీని సేకరించి ప్రత్యేకంగా గ్రీన్ కారిడార్ సిస్టమ్, పోలీసుల సహకారంతో ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా 2.50 నిముషాల్లోనే రాజధానికి తీసుకువచ్చారు. అయితే కిడ్నీ వ్యాధి బాధితుడికి చేయవలసిన ఆపరేషన్ నాలుగు గంటల ఆలస్యం అవడంతో కిడ్నీ మార్పిడి వికటించి ఆ బాధితుడు మృతి చెందిన క్రమంలో ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. బాధితుడి మృతికి వైద్యుల నిరక్షమే కారణమని పౌరహక్కుల సంఘాల కార్యకర్తలు సైతం ఆరోపించారు. ఆసుపత్రి సిబ్బంది కాకుండా కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు అంబులెన్స్ నుంచి కిడ్నీ ఉన్న పెట్టెను తీసుకెళ్లినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి.

పాట్నా విమానాశ్రయంలో పైలట్లకు సవాళ్లు

పక్షులు, చిన్న రన్‌వే, చెట్ల వల్ల ప్రమాదాలు

పాట్నా (బీహార్): పాట్నా విమానాశ్రయంతో పైలట్లకు ఇక్కట్లు తప్పడం లేదు. తరచూ పక్షులు ఢీకొట్టడం, చిన్న రన్‌వే, పొడవైన చెట్ల వల్ల ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని నిపుణులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం దిల్లీకి వెళ్లే విమానం టేకాఫ్ అయిన వెంటనే విమానం మంటల్లో చిక్కుకుంది. దాదాపు 200 మంది ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జూన్ 19న జరిగిన ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విచారణ ప్రారంభించింది. విచారణ పూర్తయ్యాకే ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోగలుగుతామని ఎయిర్ ఇండియా పైలట్ల సంఘం మాజీ అధ్యక్షుడు వీకే బల్లా అన్నారు. అయితే, పాట్నా విమానాశ్రయం పైలట్లకు సున్నిత ప్రదేశంగా మారిందన్నారు. ఒక వైపు ఎత్తైన చెట్లు ఉన్నందున విమానాలు కిందకు దిగడం, గాల్లోకి ఎగరడం చాకచక్యంతో కూడిన వ్యవహారంగా ఉందని పీటీఐకి చెప్పారు. పైలట్‌లు, సిబ్బంది మధ్య సమన్వయం, ప్రశాంత ప్రయత్నాల కారణంగానే మంటలొచ్చిన స్పైస్‌జెట్ విమానాన్ని సురక్షితంగా అత్యవసరంగా కిందికి దించడం సాధ్యమైందని చెప్పారు. రన్‌వేకి ఒకవైపు ఉన్న చెట్లను తొలగించకపోతే ఇలాంటి ఘటనలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. చెట్ల వల్ల పక్షులు వస్తాయి కాబట్టి పాట్నా విమానాశ్రయంలో దర్యాప్తు బృందం ఈ అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని భల్లా తెలిపారు. పాట్నా నుంచి దిల్లీకి బయలుదేరిన స్పైస్‌జెట్ విమానం గాల్లోకి ఎగిరిన తర్వాత ఇంజిన్ 1కి పక్షి ఢీకొట్టినట్లు కాక్‌పిట్ సిబ్బంది అనుమానించారని స్పైస్‌జెట్ ఒక ప్రకటనలో తెలిపింది. ముందుజాగ్రత్త చర్యగా కెప్టెన్... ప్రభావితఇంజిన్‌ను మూసివేసి, పాట్నాకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నాడని పేర్కొంది. ఈ విమానంలో 185 మంది ప్రయాణికులు ఉన్నారు. పాట్నా విమానాశ్రయం చిన్న రన్‌వే కారణంగా చాలా క్లిష్టమైందిగా గుర్తించినట్లు నిపుణులు భావిస్తున్నారు. మొత్తం 2,286-మీటర్ల రన్‌వేలో, కొన్ని పరిమితుల కారణంగా టేకాఫ్ కోసం కేవలం 1,954 మీటర్లు మాత్రమే అందుబాటులో ఉంది. విమానాశ్రయానికి సమీపంలోని బహిరంగ కబేళాలు, మాంసం దుకాణాలు, చెత్త కుప్పలు... పక్షులను ఆహ్వానిస్తున్నాయి. చెత్త నిల్వచేసే డంప్‌ల వద్ద పరిసరాలను అధికారులు శుభ్రంగా ఉంచుతున్నారని, అయితే కబేళాలు, మాంసం దుకాణాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యల గురించి నాకు తెలియదని జై ప్రకాశ్‌నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ అంచల్ ప్రకాశ్ పీటీఐకి తెలిపారు.

జూలై 17, 2000న ఈ విమానం పతాక శీర్షికలకెక్కింది. కోల్‌కతా నుంచి దిల్లీకి వెళ్లే బోయింగ్ 737 విమానం టేకాఫ్ అయిన వెంటనే నివాసిత కాలనీలో దూసుకుపోవడంతో ఆరుగురు స్థానికులు సహా 60 మందికి పైగా ప్రయాణీకులు మరణించారు. అనంతరం విచారణకు ఆదేశించిన కోర్టు... రన్‌వే చాలా చిన్నదిగా ఉందని తన నివేదికలో పేర్కొంది.

నల్లధనం వెలికితీత సాధ్యమేనా?

దిల్లీ హైకోర్టులో పిటిషన్

న్యూదిల్లీ: నల్లధనం, బినామీ ఆస్తులను పూర్తిగా జప్తు చేయడంతోపాటు ఆదాయానికి మించిన ఆస్తులు, మనీలాండరింగ్, పన్ను ఎగవేత, మాదక ద్రవ్యాల రవాణా తదితర నేరాల్లో దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సాధాసాధ్యాలను నిర్ధారించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ మంగళవారం దిల్లీ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. లంచం, నల్లధనం, బినామీ ఆస్తులు, పన్ను ఎగవేత, అసమాన ఆస్తులు, మనీలాండరింగ్, కల్తీ, మానవ,మాదకద్రవ్యాల అక్రమ రవాణా, కృత్రిమ నిల్వలు వంటి వాటికి సంబంధించి అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న కఠిన అవినీతి నిరోధక చట్టాలను పరిశీలించి మూడు నెలల్లో నివేదిక సమర్పించేలా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని లేదా ఆ మేరకు లా కమిషన్‌ను ఆదేశించాలని కూడా విజ్ఞప్తి చేసింది. పిటిషనర్, న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థల మొత్తం బడ్జెట్ రూ.70 లక్షల కోట్లు అని, అయితే ప్రతి ప్రభుత్వ శాఖలో భారీ అవినీతి కారణంగా బడ్జెట్‌లో 20 శాతం అంటే రూ. 14 లక్షల కోట్లు నల్లధనంగా మారుతోందన్నారు. రూ.100 కంటే ఎక్కువ విలువైన కరెన్సీని ఉపసంహరించడం, రూ.5000 కంటే ఎక్కువ నగదు లావాదేవీలను నియంత్రించడం, రూ.50,000 పైబడిన ఆస్తులను ఆధార్‌తో అనుసంధానం చేయడం, 100 శాతం ఆదాయానికి మించిన ఆస్తులు, నల్లధనం, బినామీ ఆస్తులను జప్తు చేయడం, దోపిడీదారులకు జీవిత ఖైదు విధించడం ద్వారా ప్రభుత్వం ఈ భారీ మొత్తాన్ని ఆదా చేయవచ్చునని పిటిషన్‌లో పేర్కొన్నారు. అవినీతి ప్రజాస్వామ్యం... చట్టబద్ధమైన పాలనను బలహీనపరుస్తుంది, ఇది మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుందని, మార్కెట్లను వక్రీకరించి, జీవన నాణ్యతను నాశనం చేస్తుందన్నారు. హోం, ఆర్థిక, న్యాయ, లా కమిషన్ ఆఫ్ ఇండియా, దిల్లీ ప్రభుత్వాలను కక్షిదారులుగా పిటిషన్‌లో చేర్చారు.

ఆగని కాంగ్రెస్ ఆందోళనలు

ర్యాలీకి ప్రయత్నం..అడ్డుకున్న పోలీసులు

న్యూదిల్లీ: ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ)ని మోదీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని, తమ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీని ఈడీ వేధిస్తోందని ఆరోపిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ మంగళవారం సత్యాగ్రహం చేపట్టింది. ఆ తర్వాత జంతర్ మంతర్ వరకు ర్యాలీగా వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే అనుమతి లేదంటూ పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాఘెల్ సహా సీనియర్ నేతలు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకు మాత్రమే అనుమతి ఉందని, ర్యాలీ నిర్వహిస్తామంటే అనుమతించేది లేదని పోలీసులు స్పష్టంచేశారు. పోలీసులు అడ్డుకోవడంతో బాఘెల్ తన మద్దతుదారులతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. బీజేపీ నేతలను ఫాసిస్టులుగా అశోక్ గెహ్లాట్ నిందించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ఉన్న వారిని వేధిస్తున్నారని చెప్పారు. 'బీజేపీ నాయకులు ఫాసిస్టులు. ప్రజాస్వామ్యం ముసుగు ధరించారు. ఒకవర్గంపై మరో వర్గాన్ని ఉసిగొల్పడం ద్వారా ప్రజల్లో అంతరాలు సృష్టించడానికి కుట్ర చేస్తున్నారు. సామాజిక పొందికను దెబ్బతీస్తున్నారు' అని గెహ్లాట్ విమర్శించారు. ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా సత్యాగ్రహం కొనసాగిద్దామని కార్యకర్తలకు హితబోధ చేశారు. ఏఐసీసీ కార్యాలయం చుట్టూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, ఆగ్రహోదగ్రులైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కొన్ని బారికేడ్లను బద్దలు కొట్టారు. అగ్నిపథ్‌కు వ్యతిరేకంగానూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి అగ్నిపథ్ ఓ కుట్ర అని విమర్శించారు. ఈ పథకం యువతరాన్ని అంధకారంలోకి తీసుకెళుతుందని మండిపడ్డారు.

అది శివసేన అంతర్గతం: పవార్

న్యూదిల్లీ: మహారాష్ట్రలో మహావికాస్ విఘాది(ఎంవీఏ) సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చడానికి మూడోసారి ప్రయత్నం జరిగిందని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ విమర్శించారు. శివసేన సంక్షోభాన్ని ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇది శివసేన అంతర్గత వ్యవహారమని వ్యాఖ్యానించారు. ఎంవీఏ ప్రభుత్వం ఏర్పాటులో శరద్‌పవార్ కీలకపాత్ర పోషించిన విషయం విదితమే. తమ ప్రభుత్వం ఐదేళ్లు పూర్తికాలం అధికారంలో ఉంటుందని పవార్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే బీజేపీకి మద్దతిచ్చే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. సంకీర్ణ కూటమిలో ఎలాంటి వైరుధ్యాలు లేవని తెలిపారు. ఠాక్రే నాయకత్వంపై అందరికీ పూర్తి విశ్వాసం ఉందని పవార్ మంగళవారం ఇక్కడ విలేకరులకు చెప్పారు. ఇది శివసేన అంతర్గత వ్యవహారమని, పరిస్థితిని అంచనా వేసిన తర్వాత తమకు సమాచారం ఇస్తారని తెలిపారు. తమ పార్టీ శివసేనకు మద్దతిస్తుందని తేల్చిచెప్పారు. తనకు ముఖ్యమంత్రి కావాలన్న కోరిక ఉందని ఏక్‌నాథ్ ఏనాడు తమకు చెప్పలేదని వివరించారు. ఇది ఎన్‌సీపీ అంతర్గత వ్యవహారం కాదు. శివసేన సమస్య. పరిస్థితి చక్కబెట్టిన తర్వాత శివసేన తమకు సమాచారం ఇస్తుందని చెప్పారు. శివసేన ఏ నిర్ణయం తీసుకున్నా తాము మద్దతిస్తామన్నారు.

లంచం తీసుకుని క్లినికల్ టెస్టులు పూర్తికాకుండానే

ఇంజక్షన్‌కు అనుమతిచ్చిన అధికారి అరెస్టు

న్యూదిల్లీ: నాలుగు లక్షలు లంచం తీసుకుని మూడవదశ క్లినికల్ టెస్టులు పూర్తికాని ఒక కంపెనీకి చెందిన ఇంజెక్షన్ వినియోగానికి అనుమతులిచ్చిన జాయింట్ డ్రగ్స్ కంట్రోలర్ ఎస్ ఈశ్వర రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే బెంగళూరులోని బయోకాన్ బయోలాజిక్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేసిన ఇన్సులిన్ అస్పార్ట్ ఇంజక్షన్‌కు సంబంధించిన మూడవ దశ క్లినికల్ ట్రయల్ లేకుండా చూడడం కోసం దిల్లీలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ)లో జాయింట్ డ్రగ్స్ కంట్రోలర్‌గా పని చేస్తున్న ఈశ్వర రెడ్డి రూ.4 లక్షల లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు పట్టుకున్నారు. సదరు అధికారికి లంచం ఇస్తున్న సినర్జీ నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టర్ దినేష్ దువా అనే వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. దిల్లీలోని బయోఇన్నోవాట్ రీసెర్చ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎల్ ప్రవీణ్ కుమార్, గుల్జిత్ సేథీ, అసిస్టెంట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిమేశ్ కుమార్‌లపైనా కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. వీరందరిపై నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, అవినీతి తదితర సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసులో మరికొందరిని అరెస్టు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తమ సంస్థ లంచం ఇచ్చినట్టు వచ్చిన ఆరోపణలను బయోకాన్ బయోలాజికల్ లిమిటెడ్ ప్రతినిధి కిరణ్ మజుందార్ షా ఖండించారు. తమ సంస్థ ఉత్పత్తులన్నీ చట్టబద్ధంగా ఆమోదం పొందినవేనని పేర్కొన్నారు. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా నిబంధనల్ని పాటిస్తామని వివరించారు.

త్వరలో సమీకృత పెన్షన్ పోర్టల్

న్యూదిల్లీ: పెన్షనర్లకు మరింత సౌలభ్యంగా ఉండేలా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)తో కలిసి త్వరలోనే సమీకృత పెన్షన్ పోర్టల్‌ను రూపొందించనున్నట్లు కేంద్ర పెన్షన్&పెన్షనర్ల సంక్షేమ విభాగం మంగళవారం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో రెండు రోజుల బ్యాంకర్ల అవగాహన కార్యక్రమంలో ఎస్బీఐ క్షేత్రస్థాయి ఉద్యోగులకు పెన్షన్ విధానంలో సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు పెన్షన్ పంపిణీకి సంబంధించి డిజిటలైజేషన్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. పెన్షనర్లకు సంబంధించిన ఆదాయపు పన్ను విషయాలతో పాటు డిజిటల్ విధానంలో వార్షిక జీవిత ధృవీకరణ పత్రాలను సమర్పించే మార్గాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పెన్షన్‌దారులకు అన్ని సేవలను నేరుగా అందించేందుకు ప్రస్తుతం ఉన్న కేంద్ర పెన్షన్&పెన్షనర్ల సంక్షేమ విభాగం, ఎస్బీఐ పోర్టల్‌లను అనుసంధానం చేయడం ద్వారా సమీకృత పెన్షన్ పోర్టల్‌ను రూపొందించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఎస్బీఐ సహకారంతో దేశవ్యాప్తంగా నాలుగు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించింది.

హిజాబ్ వివాదంపై

సుప్రీం విచారణ పెండింగ్

టీసీ కోరిన ఐదుగురు ముస్లిం విద్యార్థులు



న్యూదిల్లీ: కర్ణాటకలో హిజాబ్ వివాదం కొనసాగుతూనే ఉంది. కాలేజీల్లో హిజాబ్ ధారణపై నిషేధం క్రమంలో మంగళూరులోని హంపన్‌కట్ట వద్దనున్న యూనివర్సిటీ కాలేజి విద్యార్థినులు ఐదుగురు తమకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ) ఇచ్చేయాలని యాజమాన్యాన్ని కోరారు. తమను హిజాబ్ ధరించేందుకు అనుమతిచ్చే ఇతర కాలేజీల్లో చేరడానికి టీసీ కోసం ఐదుగురు విద్యార్థులు అభ్యర్థించారని హంపన్‌కట్ట యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ అనసూయ రాయ్ చెప్పారు. విద్యార్థులు రాసిన లేఖలు అసంపూర్తిగా ఉన్నట్టు గుర్తించడంతో వాటిని సరిచేసి ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎలాంటి నిర్ణయం జరగలేదన్నారు. క్యాంపస్‌లో ఇవాల్యుయేషన్ (మూల్యాంకనం) పని సాగుతుండటంతో ఆన్‌లైన్ తగతులు నిర్వహిసున్నామని, దీంతో 44 మంది ముస్లిం విద్యార్థులు క్లాసులకు తిరిగి హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. యూనిఫారాలను ధరించాలని కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినాగానీ హిజాబ్‌ను ధరించాలనుకునే వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పీఎస్ యడపడితయ్య ఇంతకుముందు ఓ ప్రకటన చేశారు. అయినాగానీ సంతృప్తి చెందని విద్యార్థులు టీసీలను కోరారు. మరోవైపు హిజాబ్ నిషేధంపై సుప్రీంకోర్టులో అనేక ఫిర్యాదులు విచారణకు నోచుకోలేదు. ఈ వ్యవహారానికి ప్రాధాన్యత ఇస్తామని మార్చి, ఏప్రిల్ నెలల్లో న్యాయస్థానం హామీలు ఇచ్చిందిగానీ అవేమీ ఆచరణ కాలేదు. హిజాబ్ నిషేధంపై ఫిర్యాదులు కోర్టు విచారణ కోసం లిస్టింగ్ కాలేదు. అయితే విద్యార్థులు ఎలాంటి వస్త్రాలు ధరించాలన్న దానిపై రాష్ట్రం జోక్యాన్ని ఫిర్యాదులు ప్రశ్నించాయి. ఎవరికి హాని కలగించని వస్త్రధారణతో సమస్య ఏమిటని అడిగాయి. మహిళల గౌరవం, విద్యా హక్కుకు డ్రెస్‌కోడ్ విఘాతం కలిగిస్తోందని, కేవలం వస్త్రధారణ కారణంగా ముస్లిం విద్యార్థులకు విద్యను నిరాకరించడం వారి వ్యక్తిగత గోప్యత హక్కును అతిక్రమించడమే అవుతుందని పేర్కొన్నాయి.

మేము చెప్పేది విన్నాకే తీర్పు ఇవ్వండి

అగ్నిపథ్‌పై సుప్రీంను కోరిన కేంద్రం: కేవియట్ దాఖలు

న్యూదిల్లీ: కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. దీంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పలు ఫిర్యాదులు దాఖలైన క్రమంలో సర్వోన్నత న్యాయస్థానంలో కేవియట్‌ను కేంద్రప్రభుత్వం తాజాగా దాఖలు చేసింది. అగ్నిపథ్ పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషనపై ఏదేని నిర్ణయానికి ముందు తాము చెప్పేది వినాలని న్యాయస్థానాన్ని కోరింది. అగ్నిపథ్ పథకాన్ని పునరాలోచించేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ న్యాయవాది హర్ష్ అజయ్ సింగ్ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పథకంలో సవరణల కోసం రిటైర్డ్ ఆర్మీ అధికారులతో సహా రక్షణ వ్యవహారాలు, రక్షణ మంత్రిత్వశాఖలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పథకంలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, అన్ని అంశాలపై చర్చించి అమలు చేసివుంటే మెరుగ్గా ఉండేదని పేర్కొన్నారు. ఇదిలావుంటే, ఈ పథకంపై న్యాయవాదులు ఎంఎల్ శర్మ, విశాల్ తివారీ కూడా సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా, పార్లమెంటు ఆమోదం లేకుండా శతాబ్దాల నాటి సాయుధ దళాల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసిందని శర్మ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పథకం వల్ల జాతీయ భద్రతపై, సైన్యంపై ప్రభావాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తివారీ కోరారు. నిరసనల్లో విధ్వంసానికి దారితీసిన పరిస్థితులపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, స్టేటస్ రిపోర్టులు సమర్పించాలని ఆయా రాష్ట్రాలకు ఆదేశాలివ్వాలని కోరారు.

వేర్వేరు ఎన్‌కౌంటర్లలో..

నలుగురు ఉగ్రవాదుల మృతి

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా, బారాముల్లా జిల్లాల్లో మంగళవారం చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్లలో నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు పోలీసులు తెలిపారు. పుల్వామాలోని తుజ్జన్‌లో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు కాశ్మీమర్ ఐజీపీ విజయ్‌కుమార్ తెలిపారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో ఒకరు జేషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన వ్యక్తి ఉన్నట్టు తెలిపారు. అతడిని మాజిద్ నజీర్‌గా గుర్తించినట్లు చెప్పారు. ఇటీవల చోటు చేసుకున్న ఎస్సై ఫరూఖ్ అహ్మద్ మీర్ హత్య కేసులో నజీర్ హస్తం ఉన్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బారాముల్లాలోని సోపోర్ ప్రాంతంలోని తులిబల్ గ్రామంలో ఉగ్రవాదులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సోదాలు నిర్వహిస్తున్న భద్రతా బలగాలపై ఉగ్రమూక కాల్పులకు దిగడంతో చోటు చేసుకున్న మరో ఎన్‌కౌంటర్‌లో గుర్తు తెలియని ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు పేర్కొన్నారు.

అభివృద్ధిని ఆపేందుకు

బీజేపీ తప్పుడు ఆరోపణలు: సిసోడియా



న్యూదిల్లీ: ఆప్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను బీజేపీ అడ్డుకుంటోందని దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆరోపించారు. పనులను అడ్డుకోవడం కోసం తప్పుడు ఆరోపణలతో వివిధ దర్యాప్తు సంస్థలకు బీజేపీ నేతలు ఫిర్యాదులు చేస్తున్నారని దుయ్యబట్టారు. కరోనా కాలంలో దిల్లీలో ఆప్ ప్రభుత్వం నిర్మించిన ఏడు తాత్కాలిక ఆసుపత్రుల నిర్మాణంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని బీజేపీ నేతలు చేసిన ఆరోపణల ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ అవినీతి నిరోధక శాఖ దర్యాప్తునకు ఆదేశించిన నేపథ్యంలో సిసోడియా ఈ మేరకు స్పందించారు. తమ ప్రభుత్వం నీతి నిజాయితీగా పని చేస్తుందని, ఎటువంటి విచారణలకు భయపడమని పేర్కొన్నారు. దిల్లీ ప్రభుత్వం వివిధ రంగాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆపడానికి బీజేపీ ఇటువంటి తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు ఇస్తోందని మండిపడ్డారు. బీజేపీ నేతలు చేసే ఫిర్యాదులను పట్టించుకోకూడదని, సాధారణ ప్రజల నుంచి అవినీతి ఆరోపణలు వస్తున్నాయా అనే విషయాన్ని గమనించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో గవర్నర్‌గా ఉన్న అనిల్ బైజల్ ఈ ఫిర్యాదును తోసిపుచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా తాత్కాలిక ఆసుపత్రుల కోసం తొలుత రూ.1,216 కోట్లతో టెండర్లు పిలిచి చివరికి దాన్ని రూ.1,256కు ఆమోదించడంలో అవినీతి ఉందని బీజేపీ ఎంపీ మనోజ్ తివారి చేసిన ఆరోపణలపై దిల్లీ ఎల్జీ దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే.

మహారాష్ట్రకు కమల్‌నాథ్



న్యూదిల్లీ: మహారాష్ట్రలో పాలక శివసేనలో అనిశ్చితి నెలకొనడంతో కాంగ్రెస్ సైతం అప్రమత్తమైంది. రాజకీయ సంక్షోభం పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ పరిశీలకుడిగా సీనియర్ నేత కమల్‌నాథ్‌ను కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రకు పంపింది. అసమ్మతినేత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో కొంతమంది శివసేన ఎమ్మెల్యేలు గుజరాత్‌లో బస చేసినట్లు తెలియడంతో కమల్‌నాథ్‌ను అక్కడికి పంపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఏఐసీసీ పరిశీలకుడిగా కమల్‌నాథ్‌ను మహారాష్ట్ర పంపాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆయన వెంటనే ముంబై వెళ్లారని కాంగ్రెస్ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. మహారాష్ట్రలో ఎన్‌సీపీ, శివసేనతో కాంగ్రెస్ అధికారం పంచుకుంటున్న విషయం విదితమే.

పేదరికానికి చిరునామా పనిమనిషి

- సామాజిక భద్రత లేదు
- లైంగిక వేధింపులు..అరకొర వేతనాలు
- వర్తించని కార్మిక చట్టాలు
- ధరల భారంతో బతుకు కష్టం

న్యూఢిల్లీ: ఇంటి పనివారల కష్టాలు వర్ణనాతీతం. వారికి కనీసం సామాజిక భద్రత లేదు. కార్మిక చట్టాలు వర్తించవు. ఇక లైంగిక వేధింపులకు అంతే ఉండదు. వేతనాలు చూస్తూ.. యజమానులు ఇచ్చినంత..వీళ్లు తీసుకున్నంత.

మొత్తం మీద పని మనుషులకు గుర్తింపే ఉండటం లేదు. ఇళ్లు ఊడ్చి, నేల కడిగి, గిన్నెలు తోముతూ జీవనం సాగిస్తున్న ఇంటి పనివాళ్ల బతుకు యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. వాళ్లు ఉండమంటే ఉండాలి. పొమ్మంటే పోవాలి. ఇచ్చే జీతానికి వెట్టి చేయించేవారు కొందరైతే... తిట్లు పెట్టి పంపేవారు ఇంకొందరు. జీతం పెంచమంటే రేపటి నుంచి రావాల్సిన పనిలేదనేవారు మరికొందరు. పేదరికానికి అసలు సిసలు చిరునామా ఇంటి పనివారలు. సాధారణంగా ఇంటి పనులు చేసే వారంతా పేద, దళిత, ముస్లిం, వెనుకబడ్డ తరగతుల నుంచి వచ్చిన వారే. వ్యవసాయం సంక్షోభంలో పడటం, వీరికి సొంత భూమి

లేకపోవడం, వ్యవసాయ రంగంలో యంత్రాలు ప్రవేశించడం వల్ల వారు పట్టణాలకు వలస వచ్చారు. ఇందులో 99శాతం మహిళలు, బాలికలు ఉన్నారు. వీరిలో 35శాతం మంది వితంతువులు. భర్త నుంచి దూరమైన వారు, ఇతర కుటుంబ సమస్యలతో ఒంటరిగా జీవిస్తున్నవారు ఎక్కువగా ఉంటున్నారు. వీరి శ్రమ ఇతర రంగాల్లోని కార్మికుల్లాగా బహిరంగంగా కనిపించదు. ఇంటి లోపలే పనిచేయాలి. వీరి కష్టానికి న్యాయమైన విలువ కట్టే పద్ధతులు అమల్లో లేవు. ఎలాంటి ఒప్పందం లేకుండానే శ్రమిస్తుంటారు. పెరుగుతున్న ధరలతో సరిపోల్చని వేతనాలతో అత్యంత పేదరికాన్ని అనుభవిస్తున్నారు. పేదరికానికి చిరునామాగా నిలుస్తున్నారు.

ఆశ్చర్యమేమంటే..పనిమనిషిగా చేరాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. ముందుగా స్థానిక పోలీసుస్టేషన్‌లో వారి వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. వారి పేరు, ఇంటి అడ్రస్, స్థానికంగా వారికున్న పరిచయాలు, వేలి ముద్రలు, గత చరిత్ర తెలపాల్సి ఉంటుంది. కానీ యజమానికి సంబంధించిన వ్యక్తిగత వివరాలు మాత్రం పనివారికి చెప్పరు. యజమాని ఇంట్లో ఏదైనా వస్తువుపోతే ముందుగా అనుమానం పనిమనిషిపైనే. వెంటనే వారిపై 'దొంగ' అనే ముద్ర పడిపోతుంది. ఒక్కోసారి యజమాని చేసే తప్పులను తమపై వేసుకుని, చట్టపరమైన శిక్షలూ అనుభవించిన ఘటనలు ఉన్నాయి. దీనంతటికీ కారణం వారు అట్టడుగు వర్గాల వారు కావడం.. కార్మికులుగా గుర్తింపు లేకపోవడమే. పనిమనుషులు ముఖ్యంగా ఇంటిని శుభ్రపరచడం, పాత్రలు కడగడం, వంట, పిల్లల, వృద్ధుల సంరక్షణలాంటి పనులు చేస్తుంటారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉంటారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కుటుంబపోషణ కోసం పట్టణాలకు వలస వచ్చిన అట్టడుగు వర్గాలకు చెందినవారే అధికం. వారు రోజంతా కష్టపడినా పనికి తగిన గుర్తింపు లేదు. వీరికి వారాంతపు సెలవు కష్టమే. ఇలా సెలవు లేకుండా 70శాతం మంది పని చేస్తున్నట్లు సమాచారం. వేతనంలో ఏ మాత్రం పెంపు లేకుండా 87.8శాతం ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయి. ఇందులో 12.75శాతం మందికి సామాజిక పథకాలు అందటం లేదని చెబుతున్నారు. పని ప్రాంతంలో లైంగిక వేధింపులకు గురవుతున్నవారు 2.8శాతం మంది ఉన్నారని ఓ ప్రైవేటు సర్వే తేల్చింది.

సంక్షేమ పథకాల్లోనూ వారికి ప్రాధాన్యత ఉండటం లేదు. రాష్ట్రంలో అందరూ సంక్షేమ ఫలాలు అనుభవిస్తున్నారని పాలకులు పదేపదే చెబుతున్నారు. కానీ, పనిమనుషులకు సంక్షేమ పథకాలతోపాటు ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు అందటం లేదు. ఉండటానికి ఇళ్లు లేక చెల్లించలేని అద్దెలతో సతమతమవుతున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు కావడం లేదు. రేషన్ కార్డులు, ప్రసూతి సౌకర్యాలు, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, అదనపు పనికి అదనపు వేతనం తదితర కోర్కెలను పరిష్కరించేందుకు సర్కారు కృషి ఏమాత్రం కనిపించడం లేదని ఇంటి పనివారలు అంటున్నారు.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.